
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 7 ఏప్రిల్ 2024 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆది) సా. 6.25
సహర్(సోమ) ఉ. 4.30

ఎండా కాలమ్
	గరిష్టం	కనిష్టం
రాజమండ్రి	42.0	24.0


బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న పురందేశ్వరి


పురందేశ్వరి దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నల్లమిల్లి

రెండో రోజు బిజీబిజీగా పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్/అనపర్తి, ఏప్రిల్ 6 : రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి రెండో రోజు బిజీబిజీగా గడిపారు. రాజమహేంద్రవరంలో శనివారం ఉదయం బీజేపీ కార్యాలయాన్ని దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఒక ప్రైవేట్ హోటల్‌లో రాజమహేంద్రవరం నియోజకవర్గ కూటమి నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం పలువురు నాయకులు ఆమెను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రాజమహేంద్రవరం కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం శనివారం రాత్రి అనపర్తి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కలిశారు. బీజేపీకి కేటాయించిన అసెంబ్లీ సీటును విజయావకాశాల ప్రాతిపదికను తిరిగి టీడీపీకి కేటాయించేందుకు సంప్రదింపులు పూర్తయిన నేపథ్యంలో వీరి కలయిక ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే అనపర్తి సీటుపై నల్లమిల్లికి చంద్రబాబు భరోసా ఇచ్చారు.ఈ నేపథ్యంలో ఈ భేటీ ఆసక్తిగా మారింది.సీనియర్ నాయకుడు గంగిన నారాయణరావు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా స్టేట్ ఇన్‌ఛార్జి సిద్ధార్థనాథ్ సింగ్ నారాయణరావుకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ల్యాండ్ లార్డు ముళ్లపూడి శ్రీనివాస్ బీజేపీలో చేరారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి జీరో.. 7

పంచాయతీలకు పవర్ కట్

- పంచాయతీల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు
- గోపాలపురం మండలంలోనే రూ.2 కోట్లు పెండింగ్

గోపాలపురం, ఏప్రిల్ 6 : పంచాయతీ పవర్ కట్ అయిపోతోంది. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు పైసా కూడా విదల్చలేదు. పైగా వచ్చిన ఆర్థిక సంఘం నిధులు దారిమళ్లించారు. దీంతో ఐదేళ్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎంతలా అంటే కనీసం విద్యుత్ బిల్లులు చెల్లించలేనంతగా పంచాయతీల్లో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. జిల్లా వ్యాప్తంగా చాలా పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. విద్యుత్ బకాయి చెల్లించకపోవడంతో గోపాలపురం పంచాయతీ కార్యాలయానికి విద్యుత్ సరఫరా అధికారులు శనివారం నిలిపివేశారు. మండలంలో 18గ్రామ పంచాయతీల్లో ఉన్న వీధిలైట్లు, మంచినీటిబోర్లు, పంచాయతీ కార్యాలయాలకు సంబంధించిన రూ.2 కోట్ల బకాయి ఉంది. ఒక గోపాలపురంలోనే సుమారు రూ.22.5 లక్షలు విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో విద్యుత్ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయమైన సమాచారం. 2022-23 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైనప్పటికీ మిగిలిన పంచాయతీల్లో కొన్ని పంచా యతీలు 10 శాతం, మరికొన్ని పంచాయతీలు 20 శాతం అప్పును చెల్లించాయి. గోపాలపురం గ్రామ పంచాయతీలో మాత్రం విద్యుత్ బకాయి చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు సరఫరా నిలిపివేశారు.



ఫ్యాన్‌కు ముచ్చెమటలు!

లోక్‌సభలో త్రిముఖం

- వైసీపీ గుండెల్లో గిడుగు పిడుగు
- ఫ్యాన్ ఓట్లను చీల్చనున్న కాంగ్రెస్ అభ్యర్థి
- కూటమికి కలిసిరానున్న మూడు పార్టీలు
- 2019 ఎన్నికల్లో మూడింటికి 50శాతం ఓట్లు
- అయోమయంలో అభ్యర్థులు
- రాజమహేంద్రవరంలో రసవత్తర పోరు


పురందేశ్వరి డాక్టర్ గూడూరి గిడుగు రుద్రరాజు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం లోక్‌సభ ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి. 2019లో త్రిముఖ పోటీ జరిగింది. నాడు టీడీపీ, జనసేన, వైసీపీ అభ్యర్థులు పోటీపడ్డారు. ఈ సారి ప్రధానంగా ద్విముఖ పోటీనే ఉన్నప్పటికీ నేనూ ఉన్నానంటూ కాంగ్రెస్ అభ్యర్థి బరిలో దిగారు. గత ఎన్నికల్లో వేర్వేరుగా పోటీ చేసిన టీడీపీ-జనసేన-బీజేపీ ఒక కూటమిగా ఏర్పడి ఈ ఎన్నికల బరిలో దిగాయి.పైగా కూటమి అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఆమె ఎన్టీఆర్ కూతురు కావడం, మరొక పక్క టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి సోదరి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అంతేకాకుండా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు కావడం ఇంకా కలిసొచ్చే అంశం. పైగా జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమికి బలమైన అభ్యర్థులు ఉన్నారు. అనపర్తి సీటు మారనుంది. టీడీపీకి తిరిగి రానుంది. మొదట టీడీపీకి కేటాయించిన ఈ సీటు పొత్తులో భాగంగా బీజేపీకి ఇచ్చిన సంగతి తెలిసిందే. కానీ అక్కడ బీజేపీ అభ్యర్థి అంతబలవంతుడు కాకపోవడంతో, తిరిగి టీడీపీకే ఈసీటు ఇవ్వడానికి నిర్ణయించుకున్నట్టు సమాచారం. దీంతో ఏడు నియోజకవర్గాల్లోనూ హేమాహేమీలు ఉన్నట్టే. ఇక వైసీపీ తరపున రాజకీయాలు అంతగా తెలియని డా. గూడూరి శ్రీనివాసరావు బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో త్రిముఖ పోటీ వల్ల ఇక్కడ వైసీపీ గెలిచింది. అప్పుడు టీడీపీ-జనసేన, బీజేపీ ఓట్లు కూడా చీలిపోయాయి. ఈసారి మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి ఒక్కటిగా పోటీ చేస్తుండడంతో కూటమి అభ్యర్థిని వైసీపీ అభ్యర్థి తట్టుకోవడం కష్టమే. పైగా అధికార వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. అన్ని వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. లోక్‌సభ పరిధిలో వైసీపీ చేసింది శూన్యం. దీంతో ఈ అభ్యర్థికి ఎదురీతే.ఇదిలా ఉండగా ఈసారి కాంగ్రెస్ తరపున బలమైన అభ్యర్థి రంగంలోకి దిగారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ అధిష్ఠానం రాజమహేంద్రవరం అభ్యర్థిగా బరిలోకి దింపింది. స్థానికంగా ఆయనకు పరిచయస్తులు ఎక్కువ. గతంలో కాంగ్రెస్‌లో ఉండి మౌనంగా ఉంటున్న నేతలు కూడా అయనకు మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. గతంలో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ విభజన తర్వాత వైసీపీ ఓటు బ్యాంక్‌గా మారింది. ఇవాళ కాంగ్రెస్ కూడా బలంగా వస్తుండడం, పైగా గిడుగు రుద్రరాజు బలమైన అభ్యర్థి కావడం వల్ల సంప్రదాయ కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌ను మళ్లీ ఆకర్షించి లాక్కునే అవకాశం ఉన్నట్టు పరిశీలకులు అంచనా వేస్తు న్నారు. దీంతో అసలే కష్టాల్లో ఉన్న వైసీపీ ఓటు బ్యాంక్‌కు రుద్రరాజు ఎంతో కొంత గండికొడతారనే అంచనా ఉంది.దీంతో కాంగ్రెస్ అభ్యర్థి గిడుగు వైసీపీ గుండెల్లో పిడుగుగా తయారయ్యారు.

18న ఎన్నికల నోటిఫికేషన్..

ఈ నెల 18న నోటిఫికేషన్ రానుంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. మే 13న పోలింగ్ జరగనుంది. పోలింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలు కావడంతో అభ్యర్థులంతా ప్రచారం జోరు పెంచారు. కూటమి అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరి రాజమహేంద్రవరంలో శనివారం ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు కూడా ప్రచారంలో దూసుకుపోతున్నారు. తెలు గుదేశం అధినేత నారా చంద్రబాబు జిల్లాలో రెండు రోజుల పర్యటనతో అసంతృప్తులు కూడా బాగా తగ్గిపోయాయి. దీంతో కూటమిలో కొత్త ఉత్సాహం నెలకొంది.

ఓటులోనూ కూటమిదే పైచేయి..

రాజమహేంద్రవరం లోక్‌సభ పరిధిలో కాంగ్రెస్‌కు మంచి ఓటు బ్యాంక్ ఉండేది. టీడీపీ ఏర్పడిన తర్వాత 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ మూడు సార్లు, బీజేపీ రెండు సార్లు, కాంగ్రెస్ నాలుగు సార్లు, వైసీపీ ఒకసారి గెలిచాయి. అంటే మొత్తం 10 ఎన్నికల్లో టీడీపీ-బీజేపీలు 5 సార్లు, కాంగ్రెస్, వైసీపీలు 5 సార్లు గెలిచాయి.ఈ సారి 11వ సారి జరిగే ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా పోటీ చేస్తుండగా వైసీపీ ఒంటరిగా పోటీ చేస్తుంది. కాంగ్రెస్, వామపక్షాల సహకారంతో పోటీ చేస్తోంది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఎన్‌వి.శ్రీనివాస్‌కు 12,725 ఓట్లు వచ్చాయి. ఇవి 1శాతం మాత్రమే. బీజేపీకి అంతే కంటే తక్కువగా 12,334 ఓట్లు వచ్చాయి. అభ్యర్థిగా పరవస్తు సత్య గోపినాథ్‌దాసు పోటీ చేశారు. అతనికి 1 శాతమే వచ్చాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి నోటా కంటే తక్కువ ఓట్లు రావడం గమనార్హం. నోటాకు 18,087 ఓట్లు లభించాయి. ఇవి కూడా 1 శాతమే. మరో ఆరుగురు స్వతంత్రులు పోటీ చేసినా వారందరికీ కలిపి 10 వేల లోపు మాత్రమే ఓట్లు లభించాయి. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిని బట్టి కూడా ఓట్లు పెరగడం గమనార్హం. 2014లో విభజన కోపం ఉన్న సమయంలోనే కందుల దుర్గేష్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయగా 21,243 ఓట్లు వచ్చాయి. తర్వాత ఎన్నికలలో అభ్యర్థి మారడంతో ఓట్లు తగ్గాయి. ఇవాళ గిడుగు రుద్రరాజుకు ఎక్కువ ఓట్లు వస్తాయని, అవి కూడా వైసీపీ నుంచి ఎక్కువగా ఆయనకు బదిలీ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇక 2019 ఎన్నికల్లో టీడీపీ-జనసేన, బీజేపీ విడివిడిగా పోటీ చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో టీడీపీ అభ్యర్థి మాగంటి రూపకు 4,60,390 ఓట్లు లభించాయి. ఇవి 37 శాతం ఓట్లు. జనసేన తరఫున పోటీ చేసిన డా. ఆకుల సత్యనారాయణ 1,55,807 ఓట్లు వచ్చాయి. ఇవి 12 శాతం ఓట్లు. బీజేపీకి 12,334 ఓట్లు వచ్చాయి. ఇవి 1శాతం. అంటే ఇవన్నీ కలసి తెచ్చుకున్న ఓట్లు 50 శాతం. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్‌కు 5,82,024 ఓట్లు 47 శాతం వచ్చాయి. ఇవాళ టీడీపీ-జనసేన,బీజేపీ కలసి కూటమిగా పోటీ చేస్తుండడంతో కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందే శ్వరికి బలం పెరిగింది.కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్య కాంగ్రెస్- వామపక్షాల ఉమ్మడి అభ్యర్థి ఎంత ప్రభావం చూపుతారో చూడాలి.ఇప్పటికే అంతా ప్రచారాలు ప్రారంభించారు.



సూరీడ్‌కి.. చిక్కవద్దు!

ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయ్ జాగ్రత్త

ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగ మండిపోతున్నాడు. మధ్యాహ్నం సమయానికి తన ప్రతాపం చూపుతున్నాడు. ఈ నెలలోనే చూస్తే గత వారం రోజులుగా 40 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదు కాలేదు. ఇక శుక్రవారం అయితే జనం మాడిపోయారు. ఎందుకంటే ఏకంగా ఈ ఏడాది తొలిసారి రాజమహేంద్రవరంలో 44 డిగ్రీల ఉష్ణో గ్రత నమోదైంది. దీంతో తీవ్ర వడగాడ్పులు వీస్తున్నాయి. వాతావరణం మారిన నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తపై ప్రత్యేక కథనం..

- వడదెబ్బ ప్రాణాంతకం
- పిల్లలు..వృద్ధులు..గర్భిణులకు ఇబ్బందే
- ఎండ పెరిగితే ఇంటి పట్టునే ఉండాలి
- కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి
- వడదెబ్బకు గురైతే చెమట పట్టదు
- రోడ్లపై ఆహారం సేవించకూడదు
- చల్లని రంగు నీళ్లకు దూరంగా ఉండాలి
- రోజూ 15 గ్లాసుల నీళ్లు తాగాలి
- వడదెబ్బ తగిలిన వారికి నీళ్లు తాగించొద్దు

కొవ్వూరు, ఏప్రిల్ 6 : వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రత, వడగాడ్పుల కారణంగా వడదెబ్బ (సన్‌స్ట్రోక్), డీ హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది..సరైన సమయంలో చికిత్స తీసుకోకుంటే ప్రాణాంతకంగా మారవచ్చునని దొమ్మేరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్.ధర్మరాజు తెలిపారు. వడదెబ్బ (సన్‌స్ట్రోక్) కారణంగా శరీరంలోని ఉష్ణోగ్రత నియంత్రణ శక్తి కోల్పోతోంది. శరీర ఉష్ణోగ్రత పెరిగిపోతోంది. దీంతో శరీరంలోని అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుంది. ఎక్కువగా, పిల్లలు, గర్భిణులు పెద్ద వయసు వారు జాగ్రత్తలు పాటించాలి. అధికంగా ఎండ ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఇంటిపట్టునే ఉండాలి. అత్యవసర సమయంలో బయటకు వెళ్లవలసి వస్తే గొడుగు లేక తలకు టోపీ వంటివి ధరించాలి.

- **డీ హైడ్రేషన్ :** వేసవి తీవ్రత కారణంగా వచ్చే డీహైడ్రేషన్‌తో డయేరియా,వాంతులు,జ్వరం వస్తాయి. శరీరంలో నీటి శాతం తగ్గి కళ్ళు తిరిగే ప్రమాదం ఉంది.
- **లక్షణాలు :** చర్మం ఎర్రగా కావడం, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండడం,శరీరంపై ఎర్రటి పొక్కులు రావడం, నీరసం, తీవ్ర జ్వరం, తలనొప్పి, మానసిక ఒత్తిడి, కళ్ళు తిరగడం,వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర లేదా కలవరింతలు, ఫిట్స్ లేదా అపస్మారకస్థితి కలుగుతుంది. ఇలా జరిగితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

చేయకూడనివి..

- తీవ్ర ఉష్ణోగ్రతలు ఉంటే ఎక్కువగా తిరగరాదు.
- రోడ్లపైవిక్రయించే చల్లని పానీయాలు తాగరాదు
- రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినరాదు.
- మద్యం సేవించరాదు.. మాంసాహారం తగ్గించాలి..
- తాజా కూరగాయలను ఆహారంగా తీసుకోవాలి.

చేయాల్సినవి...

- నీరు, పండ్ల రసాలు, కొబ్బరినీళ్ళు, మజ్జిగ, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
- నలుపు, ముదురుగా ఉండేవాటికి బదులు లేత రంగుల్లో లభించే తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి.
- రోజు కనీసం 15 గ్లాసుల నీళ్ల తాగాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి.ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి. ఎండవేళ బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపి ధరించాలి.

ప్రథమ చికిత్స ఇలా చేయాలి..

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని నీడ ప్రదేశానికి చేర్చాలి.
- శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం అంతా తుడవాలి.
- ఫ్యాను గాలి, చల్లని గాలి తగిలేలా ఉంచాలి
- ఉప్పు కలిపిన మజ్జిగ (లేదా) చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం, (లేదా) ఓరల్ డీహైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) తాగించాలి.
- పిల్లలు, గర్భిణులు, వృద్ధుల పట్ల శ్రద్ధ తీసుకోవాలి.
- వడదెబ్బ తగిలి అపస్మారక పరిస్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలి.


బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో ఓఆర్ఎస్ కార్నర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

ప్రభుత్వ కార్యాలయాల్లో ఓఆర్ఎస్ కార్నర్

బిక్కవోలు, ఏప్రిల్ 6 : వడదెబ్బకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా. ఎం.దుర్గాదేవి సూచించారు.ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో ఓఆర్ఎస్ కార్నర్‌ను ఏర్పాటు చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను లీటరు నీటిలో కలిపి తరచూ తీసుకుంటే వడదెబ్బకు గురి కాకుండా ఉంటామని తెలిపారు. వృద్ధులు, పెద్దలు ఇంటి నుంచి పనులపై బయటకువెళ్లేవారు ఉదయం 11 గంటల లోపు తిరిగి రావాలని, అలాగే సాయంత్రం 4 గంటల తరువాత మరలా బయటకు వెళ్లాలన్నారు. తెల్లని పలుచని కాటన్ దుస్తులు ధరిస్తే మంచిదన్నారు. ఈ కార్నర్‌లను తహశీల్దార్, పోలీస్‌స్టేషన్, మండలంలోని ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భవాని, ఏవో శామ్యూల్‌జాన్, ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టైరు పేలి.. యాసిడ్ ట్యాంకర్ బోల్తా



తాళ్లపూడి, ఏప్రిల్ 6 : పెనుప్రమాదం త్రుటిలో తప్పింది.. సగ్గొండ ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీ నుంచి శుక్రవారం అర్ధరాత్రి రాజమహేంద్రవరానికి యాసిడ్ ట్యాంకర్ బయలుదేరింది. తాళ్లపూడి ఏటిగట్టు మీద ఒక్కసారిగా ట్యాంకర్ టైరు పేలిపోయింది. డ్రైవర్‌కు అదుపు చేసే అవకాశం లేకపోవడంతో అదుపుతప్పి ఏటుగట్టు కిందకి దొర్లి బోల్తా పడింది. రాత్రి సమయంలో జరిగిన ఈ ప్రమాద సంఘటన గ్రామస్థులకు తెలియడంతో అంతా కంగారుపడ్డారు. ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడ్డారు. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రమాదం కానీ, పాణనష్టం గానీ జరుగలేదు. ఈ మేరకు సమాచారం అందడంతో శనివారం ఉదయం కొవ్వూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి ట్యాంకర్ పేలకుండా చర్యలు చేపట్టారు. అనంతరం బోల్తా పడిన లారీలోని యాసిడ్‌ను వేరే లారీలోకి నింపి తరలించారు. ఇదిలా యాసిడ్ లారీని ప్రక్కకు తరలించే సమయంలో విద్యుత్ వైర్లు తగిలి ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతన్ని కొవ్వూరు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.


చంద్రబాబుకు చెక్ అందజేస్తున్న కన్నయ్య

చంద్రబాబుకు పార్టీ ఫండ్

రూ.కోటి అందజేత

నల్లజర్ల,ఏప్రిల్ 6 : టీడీపీకి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. నల్లజర్లలో శుక్రవారం చంద్రబాబుకు అదే గ్రామానికి చెందిన కోరా కన్నయ్య దంపతులు రూ. కోటి పార్టీ ఫండ్‌ను అందించారు.74 ఏళ్ల వయసులో సైతం రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం నిరంతరం తపన పడుతున్న చంద్రబాబుకు తమ కుటుంబం అండగా ఉంటుందన్నారు.అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్న మా అబ్బాయి వంశీ కోరిక మేరకు పార్టీ ఫండ్ అందించినట్టు శనివారం చెప్పారు.


సమాధి వద్ద పూజలు చేస్తున్న శాంతకుమారి

సాధు అమ్మ సమాధిని దర్శించుకున్న

తెలంగాణ సీఎస్

ఉండ్రాజవరం, ఏప్రిల్ 6 : చివటం గ్రామంలో సాధు అమ్మవారి సమాధిని తెలంగాణ సీఎస్ ఎ.శాంతకుమారి శనివారం దర్శించుకున్నారు. సుమారు రెండు గంటల పాటు అమ్మవారి ఆలయం, ఇతర ఆలయాల్లో ఆమె పూజలు చేశారు. రచయిత ఎక్కిరాల భరద్వాజ రచించిన అమ్మవారి చరిత్ర చదివి దర్శనానికి వచ్చినట్టు సీఎస్ తెలిపారు.తహశీల్దార్ నవీన్‌కుమార్,కార్యదర్శి కృష్ణవేణి, వీఆర్వోలు ఆమెకు స్వాగతం పలికారు.ఆశ్రమ సంఘ అధ్యక్షురాలు కరుటూరి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న దమ్మాలపాటి కృష్ణమోహన్

న్యాయవాదుల పాత్ర కీలకం

టీడీపీ లీగల్ సెల్ వర్క్‌షాప్‌లో కృష్ణమోహన్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 6 : సార్వత్రిక ఎన్నికల్లో న్యాయవాదులు కీలకంగా వ్యవహరించాలని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దమ్మాలపాటి కృష్ణమోహన్ ,రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ళ సుబ్బారావు అన్నారు. టీడీపీ లీగల్ సెల్ ఇన్‌చార్జి గన్నికృష్ణ ఆధ్వర్యంలో మోరంపూడి గన్నిస్ శుభమస్తు ఫంక్షన్ హాలులో జోన్ -2 పరిధిలో ఉన్న ఐదు పార్లమెంట్, 35 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని లీగల్ సెల్ సభ్యులకు, పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులపై వర్క్‌షాప్ నిర్వహించారు. తొలుత ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గన్నికృష్ణ మాట్లాడుతూ అధికార పార్టీ కుట్రలను తిప్పికొట్టాలన్నారు.టీడీపీ లీగల్ సెల్ ముఖ్యప్రతినిధి కృష్ణ మోహన్ మాట్లాడుతూ ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో లౌడ్ స్పీకర్, రోడ్ షో‌సమావేశాలకు మాత్రమే ఆర్‌వో నుంచి అనుమతులు తీసుకోవాలని మిగిలిన వాటికి అక్కర్లేదన్నారు.ముప్పాళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ న్యాయవాదులు క్రియాశీలకంగా వ్యవహరించాలని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం నామినేషన్ కూడా వేసే పరిస్థితి లేకుండా రాక్షస పాలన చూశామన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ చాలా మంది అధికారులు ప్రభుత్వానికి తొత్తులుగా పనిచేస్తున్నారన్నారు.గత నాలుగేళ్లలో మూడేళ్లగా ఒకే చోట పని చేస్తున్న అధికారులను గుర్తించి బదిలీ చేయాలన్నారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ అధికార పక్షం చేస్తున్న అరాచకాలను ఎదుర్కోవాలంటే టీడీపీ లీగల్ సెల్ సేవలు అవసరమన్నారు. రానున్న 40 రోజుల్లో లీగల్ సెల్ అభ్యర్థుల పక్షాన నిలబడాలని విజ్ఞప్తి చేశారు.ఈ వర్క్‌షాప్‌లో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొదులూరు వెంకటేశ్వరరావు, హైకోర్టు న్యాయవాదులు చంద్రారెడ్డి, గూడపాటి లక్ష్మీనారాయణ, హరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడబాల రామారావు, పబ్బినేని విజయ్, రాజమండ్రి బార్ కార్యదర్శి రమేష్, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి పంతం సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి సునీల్, రాజమండ్రి బార్ మాజీ అధ్యక్షుడు అమ్మన్నచౌదరి, కాకినాడ జిల్లా అధ్యక్షుడు నాగబాబు, కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, యర్రా వేణుగోపాలరాయుడు, కాశి నవీన్ కుమార్, వాసిరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గరుడవాహనంపై
స్వామివారి గ్రామోత్సవం

● ఘనంగా అధ్యయనోత్సవాలు



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

ఆత్రేయపురం, ఏప్రిల్ 6: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలకు ముందుగా నిర్వహించే అధ్యయనోత్సవాలు రెండోరోజు శనివారం ఘనంగా నిర్వహించారు.వసంత మండపంలో వేద పండితులు చతుర్వేద పారాయణం, ద్రవిడవేద పారాయణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పల్లకిపై స్వామివారు ఆలయ ప్రదక్షణ చేశారు. తిరువీధులలో స్వామివారు గరుడ వాహనంపై విహరించి భక్తులను కటాక్షించారు. అనంతరం రాత్రి చంగోలం పారాయణం, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, మహిళల కోలాట ప్రదర్శన, అన్నమయ్య సంకీర్తనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అశేషభక్తజనం అధ్యాయనోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఉపకమీషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఏర్పాట్లు నిర్వహించారు.

బాలబాలాజీ ఆదాయం రూ.1,61,038

మామిడికుదురు, ఏప్రిల్ 6: అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1,61,038 ఆదాయంగా వచ్చిందని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. శనివారం దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వైనతేయ నదిలో భక్తులు స్నానమాచరించి స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. స్వామివారిని 2694 మంది దర్శించుకుని 2017 మంది అన్నప్రసాదం స్వీకరించారని ఏసీ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి
పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, ఏప్రిల్ 6: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,34,080, అన్నదాన విరాళాలు రూ.42,670, కేశఖండన ద్వారా రూ.5,760, తులాభారం రూ.100 వెరసి రూ.2,82,610 ఆదా యం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం ఛైర్మన్ కర్రి జగ దీష్, అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమా చార్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి జీరో

- ఫ్లయ్ ఓవర్ ఇచ్చింది మేమే
- భూముల చదునులో రూ.400 కోట్లు కొట్టేసిన వైసీపీ
- కూటమి అభ్యర్థులను గెలిపించాలి
- రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి



రాజమహేంద్రిలో బీజేపీ కార్యాలయం ప్రారంభిస్తున్న సిద్ధార్థ్‌నాథ్‌సింగ్, పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 6: రాష్ట్రంతో పాటు రాజమహేంద్రవరం ప్రజలు కూడా పరిపాలనలో మార్పు కోరుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో ఐదేళ్ల గడిచినా రాష్ట్రంలో అభివృద్ధి లేదు. ఏ వర్గానికి సంక్షేమం లేదు అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలో బీజేపీ పార్లమెంట్ కార్యాలయాన్ని శనివారం దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులు ప్రారంభించి పూజలు చేశారు. పార్టీ కార్యాలయం వద్ద, ఆ తర్వాత ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో పార్టీ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో పురందేశ్వరి మాట్లాడారు. రాజమహేంద్రవరం అభివృద్ధి జీరో అని, మోరంపూడి వద్ద ఫ్లయ్ ఓవర్ ఇచ్చింది కేంద్ర ప్రభుత్వమే తప్ప ఇక్కడి ప్రజాప్రనిధులు కాదనే సంగతి ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఆకాంక్షల మేరకు అభివృద్ధి జరగలేదు అనే భావన రాజమహేంద్రవరం ప్రజల్లో ఉందన్నారు. కేంద్రం భారీగా ఇళ్ల మంజూరు చేసినా ఆశించిన స్థాయిలో ఇళ్ల నిర్మాణం జరగలేదన్నారు. జగనన్న కాలనీలు కోసం తక్కువ ధరకే భూసేకరణ చేసి ప్రభుత్వం నుంచి భారీగా డబ్బులు తీసుకోవడం చేశారన్నారు. భూములు చదును చేస్తున్నామని మూడు నుంచి నాలుగు వందల కోట్లు కొట్టేసి ప్రజలను మోసం చేశారు. దౌర్భాగ్యపు రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపడానికే బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయని, కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. రాజమహేంద్రవరం ఇంతకు ముందున్న నాయకులు అలవి కాని వాగ్దానాలు చేశారని, రాజమండ్రి, కాకినాడ ట్విన్ సిటీలు చేస్తామని, పాశ్చాత్య దేశాలుగా చేస్తామని చెప్పిన వారు కనీసం పర్యాటక రంగాన్ని కూడా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. తాను రాజమహేంద్రవరం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని కూటమి పార్టీల అభ్యర్థులను కలుపుకుంటూ ముందుకు వెళతూ వారి సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జి సిద్ధార్థనాథ్ సింగ్, పేరెళ్ల చంద్రశేఖర్ జీ, జిల్లా అధ్యక్షుడు దత్తు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి లంక దినకర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి ఇతర నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి చింతలూరు నూకాంబికా జాతర



- కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- 8న తీర్థ మహోత్సవం

ఆలమూరు, ఏప్రిల్ 6: గోదావరి జిల్లాలలో పేరుగాంచిన ప్రధా న జాతరలలో ఒకటైన బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఆలమూ రు మండలం చింతలూరు నూకాంబికా జాతర ఈనెల 7నుంచి ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈనెల 7న జాతర మహోత్సవం, 8న తీర్థమహోత్సవం, 9న ఉగాది ఉత్సవాలతోపాటు నెల రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా కట్టుదట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మద్దూరి శివరామకృష్ణ తెలిపారు. దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. లక్షలాదిమంది భక్తులు తరలిరానున్న ఈజాతరను సమర్ధవంతంగా నిర్వహించాలని పలుశాఖల అధికారులతో సమన్వయ కమిటీలను కొత్తపేట ఆర్డీవో జీవీవీ.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. చంటిపిల్లల దేవతగా కొలిచే నూకాంబికా అమ్మవారికి జాతర ఉత్సవాలలో అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు, చెల్లించుకుని వారపోత, తుళ్లిబిళ్ల, కావిడి కోళ్లు, గండాదీపం ఇక్కడ ప్రధానంగా మొక్కులు తీర్చుకుంటారు. సాధారణంగా చంటిపిల్లల్లో వచ్చే ఆటలమ్మ, పొంగు వంటి వ్యాధులు అమ్మవారి ఆగ్రహంవల్ల వస్తాయని అందువలన ఈవ్యాధి సోకిన చంటిపిల్లలచేత ఈ మొక్కులు తీరుస్తుంటారు. ఈవ్యాధులు రానివారు అమ్మ వారి అనుగ్రహం ఉందని మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో పూర్వపు ఉభయగోదావరి జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు చింతలూరు తరలివస్తారు. జాతరకు వచ్చే భక్తుల కోసం రావులపాలెం, అమలాపురం, రాజమహేంద్రవరం, రామచంద్రాపురం డీపోల నుంచి ఇక్కడికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆలమూరు ఎస్‌ఐ శ్రీనునాయక్ చెప్పారు.

ఉగాది పురస్కరించుకుని
సత్యదేవుడికి సీఎంఆర్ పట్టువస్త్రాలు అందజేత



సీఎంఆర్ అధినేత సత్యదేవుడికి అందించిన నూతన పట్టువస్త్రాలు

అన్నవరం, ఏప్రిల్ 6: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఈనెల 9న ఉగాది పర్వదినం పురస్కరించుకుని శనివారం విశాఖపట్నం సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ పట్టువస్త్రాలను అందజేశారు. మూలవరులకు, క్షేత్ర పాలకులు సీతారాములు, వనదుర్గ, కనకదుర్గలు ధరించేందుకు వీటిని సమర్పించారు. దేవస్థానం ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, పీఆర్వో కృష్ణారావులకు అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కంచి మూర్తి, ఇంద్రగంటి సుధీర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా పీఆర్వో మాట్లాడుతూ ప్రతీ ఏటా ఉగాదికి సీఎంఆర్ అధినేత పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

ఘనంగా స్వామివారి శాంతి కల్యాణం

అంతర్వేది, ఏప్రిల్ 6 : బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో బహుళ ద్వాదశిని పురస్కరించుకుని స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. తొలుత అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పాణిగ్రహణం, మంగళధారణలను వైభవంగా భక్తుల గోవింద నృసింహనామస్మరణతో ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి శాంతి కల్యాణం తిలకించి తరించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, అర్చకస్వాములు, భక్తులు పాల్గొన్నారు.



ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

టి.కొత్తపల్లిలో పొన్నాడకు నిరసన సెగ

● పొన్నాడ డౌన్ డౌన్ అంటూ నినాదాలు

ఐ.పోలవరం, ఏప్రిల్ 6: ముమ్మిడివరం వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌కు టి.కొత్తపల్లిలో చుక్కెదురయ్యింది. శనివారం ఎన్నికల ప్రచారంలో ఆయనకు ఎమ్మార్పీఎస్ నిరసన సెగ తగిలింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలో ఎమ్మెల్యే నిబంధనలు ఉల్లంఘించి జగ్జీవన్‌రామ్ విగ్రహం ముసుగు తొలగించి పూలమాల వేయడంపై ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. వద్దని వారించినా దండ వేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వేసిన దండను ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తొలగించి విగ్రహానికి ముసుగు వేశారు. ఎన్నికల నియమావళి అతిక్రమించారని ఎమ్మార్పీఎస్ ఆరోపించింది. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పొన్నాడతో వాగ్వివాదానికి దిగడంతో గందరగోళం ఏర్పడింది. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పొన్నాడ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మాదిగలకు అన్యాయంచేసిన పొన్నాడ అంటూ నినాదాలు చేశారు.

కళలు విశ్వజననీయమైనవి

- మాజీ ప్రధాని పీవీ కుమార్తె సురభీ వాణీదేవి
- శ్రీప్రకాష్‌లో ఆకట్టుకున్న హరివిల్లు



మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహరావు కుమార్తెను సత్కరిస్తున్న శ్రీప్రకాష్ యాజమాన్యం

పెద్దాపురం, ఏప్రిల్ 6: కళలు విశ్వజననీయమైనవని భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ (తెలంగాణా) సురభీ వాణీదేవీ అన్నారు. స్థానిక రామారావుపేట శ్రీప్రకా ష్ సినర్జీస్ పాఠశాలలో నిర్వహించిన హరివిల్లు కార్యక్రమానికి ఆమె శనివారం హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆమె మాట్లాడారు. కళలు మానవ జీవితానికి సన్నిహిత సంబంధం కలవని సంస్కృతి, ప్రతిబింబానికి ఒక దేశంకానీ, ఒకజాతికానీ ఎంత ఉన్నతమైనదో తెలియజేసేదే కళ అని అన్నారు. కళలచేత మానవ జీవితానికి వికాసం ఉందన్నారు. మనోవికాసానికి ఆనందానికి కళలు మార్గదర్శకాలన్నారు. శ్రీప్రకాష్ పాఠశాల కళలకు ఇంత ప్రాధాన్యం ఇవ్వడం గొప్పవిషయమన్నారు. ప్రముఖ డైరెక్టర్ తరుణ్‌భాస్కర్ తల్లి గీతాభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయిలో సైన్సు ఆర్ట్స్ పట్టాలను పొందేవిధంగా తర్ఫీదు పొందారన్నారు. అలాగే విద్యార్థులు ఎంతో సృజనాత్మకంగా, కళాత్మకంగా తీర్చిదిద్దిన కళాఖండాలు ఎంతో బాగున్నాయని ప్రశంసించారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ రామగణేష్ మాట్లాడుతూ చిన్నారులకు బాల్యం నుంచే కళల పట్ల మక్కువ పెంచే విధంగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రాకాష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో హరివిల్లు పేరుతో ఇంత గొప్ప కళాత్మకమైన కార్యక్రమాన్ని నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈకార్యక్రమానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు కలిగిఉన్న వ్యక్తులు ముఖ్యఅతిథులుగా హాజరుకావడం చాలా సంతోషదాయకమన్నారు. దేశంలో అన్నిరాష్ట్రాల సంస్కృతులు, సంప్రదా యాలు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ హరివిల్లు అనే కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్ర మాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఎల్‌సీ కర్రి పద్మశ్రీ, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, అకడమిక్, కల్చరల్ కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం లారీ పట్టివేత

● 258 క్వింటాళ్ల బియ్యం సీజ్



బియ్యం లోడు వాహనాన్ని పట్టుకున్న ఎస్ఐ రవీంద్రబాబు, ఎంఎస్‌వో మమత

సర్పవరంజంక్షన్, ఏప్రిల్ 6: విశాఖజిల్లా నుంచి అక్రమంగా కాకినాడ పోర్టుకి రవాణా అవుతున్న పీడీ ఎస్ బియ్యం లోడు లారీని తిమ్మాపురం పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ జిల్లా పెద్దిపాలెం నుంచి శ్రీలక్ష్మీ వెంకటేశ్వర లారీ సర్వీసుకు చెందిన లారీలో పీడీఎస్‌కు చెందిన బియ్యం లోడు అక్రమంగా రవాణా అవుతుందని 112 కాల్ ద్వారా పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పీడీఎస్ బియ్యం లోడు లారీని శుక్రవారం తెల్లవారుజామున 1.50 గంటలకు పండూరు జంక్షన్‌వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా లోడు లారీని పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపా రు. ఈ బియ్యం లోడు లారీ విశాఖజిల్లా పెద్దిపాలెం నుంచి వరంగల్ జిల్లాకు వెళుతున్నట్లు రసీదులో ఉందన్నారు. కానీ లోడు లారీ కాకినాడ పోర్టుకి సరు కు రవాణా అవుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా అదుపులోకి తీసుకున్న బి య్యం లోడు లారీని జిల్లా పౌరసరఫరాల శాఖ గోదాములకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీజ్‌చేసిన లారీలో 520 బియ్యం బస్తాల్లో 258.18 క్వింటాళ్ల సరుకు ఉన్నట్లు మండల సివిల్ సప్లయిస్ అధికారిణి మమత తెలిపారు. వీటిని ఎంఎల్ఎస్ పాయింట్‌కి అప్పగించారన్నారు. సేకరించిన శాంపుల్స్‌ని పరీక్షకోసం జిల్లా మేనేజర్ ద్వారా పంపించి నిర్ధారణ చేస్తామ ని, నిందితులపై 6ఏ కేసు నమోదుకు సిఫార్స్ చేస్తామన్నారు.

చెట్లు నరికిన వైసీపీ మండలాధ్యక్షుడిపై కేసు

గోకవరం, ఏప్రిల్ 6: వైసీపీ గోకవరం మండలాధ్యక్షుడు పాటి రాంబాబుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన వైసీపీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు అదే గ్రామంలోని సుందరమ్మ సత్రం భూములను లీజుకు తీసుకొని సాగు చేస్తున్నాడు.ఈ క్రమంలో లీజుకు సాగు చేస్తున్న పొలంలో కొన్ని జీడిమామిడి చెట్లను అక్రమంగా నరికి బయటకు తరలించినట్లు ఎండోమెంట్ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో రాంబాబుపై వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు శనివారం ఎస్ఐ నాగరాజు తెలిపారు.

వైసీపీ ప్రచారంలో భవిత కేంద్రం ఆయా

● ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తున్న అధికార పక్షం

సీతానగరం, ఏప్రిల్ 6: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తన భర్తను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్న రాజానగరం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జక్కంపూడి రాజా సతీమణి జక్కంపూడి రాజశ్రీతో కలసి సీతానగరం భవిత కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న రాజేశ్వరి అనే మహిళ నేరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సంఘటన పలు విమర్శలకు తావిస్తోంది. తరచూ ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కుతున్న వైసీపీ చర్యల్లో ఇదొక మచ్చుతునక. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేస్తున్నా అధికార పార్టీ నాయకులు మాత్రం తమ దారి తమదే అన్నట్టు ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంగిస్తూనే ఉన్నారు. ఒక వైపు ప్రభుత్వ జీతం తీసుకుంటూ మరోవైపు ఒక రాజకీయ పార్టీ తరుపున నేరుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వోద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటున్నా ఉద్యోగుల్లో మార్పులు రావడం లేదు. ఇటువంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష నాయకులు కోరుతున్నారు.



ఎమ్మెల్యే రాజా సతీమణి రాజశ్రీతో ఎన్నికల ప్రచారంలో భవిత కేంద్రం ఆయా

కాకినాడ జిల్లా స్వీప్
అంబాసిడర్‌గా యశస్వి



యశస్విని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ నివాస్

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 6: ఓటుహక్కు వినియోగంపై యువతలో చైతన్యాన్ని తీసుకువచ్చే లక్ష్యంతో ప్రముఖ సినీగాయకుడు జీ-సరిగమప కార్యక్రమ విజేత యశస్వి కొండేపూడిని కాకినాడ జిల్లా స్వీప్ ప్రోగ్రాం అంబాసిడర్‌గా నియమించినట్లు జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను ఆయన మర్యాదపూర్వంగా కలిశారు. లోక్‌సభ, శాసనసభ సాధారణ ఎన్నికలు 2024 కు సంబంధించి ఓటర్లలో చైతన్యం అవగాహన కల్పించే లక్ష్యంతో జిల్లాలో స్వీప్ కార్యక్రమాలు వినూత్నంగా చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

● తెలంగాణవాసి దుర్మరణం, ఇద్దరికీ గాయాలు



మృతి చెందిన పట్టెం రాజు

ఎటపాక, ఏప్రిల్ 6: అల్లూరి జిల్లా ఎట పాక మండలం నెల్లిపాక, చోడవరం గ్రామాల మధ్యలో జాతీయ రహదారిపై శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్న ఘటనలో తెలంగాణ వాసీ దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం మూకమామిడి గ్రామానికి చెందిన పెట్టెం రాజు (30) ఓ పని నిమిత్తం నెల్లిపాకకు వచ్చి తిరిగి ద్విచక్ర వాహనంపై భద్రాచలం వైపు వెళ్తున్నాడు. ఇదే క్రమంలో భద్రాచలం ఆసుపత్రికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామైన నెల్లిపాకకు గ్రామ వలంటీర్ మడివి కమల ఆమె కొడుకు చందు వస్తున్నారు. ఈనేపథ్యంలో నెల్లిపాక- చోడవరం గ్రామాల మధ్యలోని అంతరాష్ట్ర చెక్‌పోస్టు సమీపంలో ఈరెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో తలకు, చాతిభాగంలో తీవ్ర గాయాలైన పెట్టెం రాజు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వలంటీర్ కొడుకు చందుకి తీవ్ర గాయాలయ్యాయి. కమలకు స్వల్ప గాయాలతో బయట పడింది. క్షతగాత్రులను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

అంబాజీపేట, ఏప్రిల్ 6: కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు పరిధిలోని గొల్లగుంట గ్రామానికి చెందిన కడలి వెంకటరమణ(50) తన ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ కె.చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లగుంటకు చెందిన వెంకటరమణ 15 ఏళ్ల క్రితం భార్య, పిల్లలు వదలి వెళ్లడంతో ఒంటిరిగా జీవిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున అతని ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ మేరకు అతని సోదరుడు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈజీమనీ కోసం బైక్‌ల చోరీ

- పోలీసులకు చిక్కిన నలుగురు సభ్యుల ముఠా
- 6 బైక్‌లు స్వాధీనం చేసుకున్న పట్టణ పోలీసులు



బైక్‌ల చోరీకి పాల్పడుతున్న ముఠా సభ్యులను పట్టుకున్న పట్టణ పోలీసులు

మండపేట, ఏప్రిల్ 6: జల్సాలకు అలవాటుపడి చేడు వ్యసనాలకు బానిసలై ఈజీమణి కోసం దొంగతనాలను వృత్తిగా ఎంచుకుని బైక్‌ల చోరీకి పాల్పడున్న ముఠా సభ్యులను పట్టుకుని పట్టణ పోలీసులు గుట్టు రట్టుచేశారు. మండపేట పట్టణ ఎస్.ఐ హరికోటి శాస్త్రి తెలిపిన వివ రాల ప్రకారం పట్టణంతోపాటు ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో బైక్‌లు చోరీకి పాల్పడే ముఠా సభ్యులను శనివారం అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈనెల 4న మండపేటకు చెందిన వ్యక్తి బైక్ చోరీకి గురైంది. బైక్‌ను పోగొట్టుకున్న బాధితుడు పట్టణ పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ వేగవంతం చేశారు. బైక్ చోరీలు జోరుగా జరుగుతున్న నేపథ్యంలో కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట సీ.ఐ అఖిల్‌జమా, పట్టణ ఎస్.ఐ హరికోటిశాస్త్రి, ఇద్దరు కానిస్టేబుల్స్‌తో బృందాన్ని ఏర్పాటు చేశారు. వారు నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఈనేపథ్యంలో శనివారం పట్టణంలో సంఘం కాలనీ రోడ్డు సమీ పంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించగా ఈజీమణి కోసం అలవాటుపడి, చేడు వ్యవసనాలకు లోనై బైక్‌లను చోరీకి పాల్పడుతున్నట్లు విచారణలో అంగికరించటంతో పాటు చోరీలకు పాల్పడిన బైక్‌ల వివరాలను పోలీసుల రాబట్టారు. చోరీకి పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులు పథకం ప్రకారం చోరీలకు పాల్పడుతుంటారని పోలీసులు చెప్పారు. గోకవరం మండలం మొల్లేటి మల్లవరంనకు చెందిన ముచ్చకర్ల ప్రసాద్, బురుకట్ల కటాస్వా ములు, మండపేట మండలం ఇప్పనపాడుకు చెందిన మొక్క అప్పారావులను అదుపులోకి తీసు కుని అరెస్టు చేశామన్నారు. నిందితులు ఉమ్మడి జిల్లాలోని మెట్టప్రాంతాలైన జగ్గంపేట, ఏలేశ్వరం, పెద్దాపురం, మండపేట పట్టణంతోపాటు, విశాఖలో రెండుచోట్ల చోరీలకు పాల్పడినట్లు ముఠా సభ్యులు అంగీకరించరని ఎస్.ఐ తెలిపారు. వారివద్ద నుంచి ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ రూ.5లక్షలు వరకు ఉంటుందని ఎస్.ఐ తెలిపారు. చోరీలు చేసిన బైక్‌లను మండపేట పట్టణంలోని గొల్లపుంత టిడ్కో గృహాల వద్ద దాచి ఉంచారని పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన వారిని ఆలమూరు కోర్టులో హాజరుపర్చగా ఈనెల 12వరకు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకున్న రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, సీఐ అఖిల్‌జమా. ఎస్ఐ హరికోటిశాస్త్రి, కానిస్టేబుల్స్ సతీష్, రమేష్‌లను జిల్లా ఎస్పీ శ్రీధర్ అభినందించారు.

ఉండ్రాజవరంలో ఇద్దరు దొంగలు అరెస్టు

● 17 మోటారు సైకిళ్ల స్వాధీనం



ఇద్దరు బైక్ దొంగలను పట్టుకున్న పోలీసులు

ఉండ్రాజవరం, ఏప్రిల్ 6: మోటారుసైకిళ్ల దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు సీఐ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఉండ్రాజవరం పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిడదవోలుకు చెందిన బొద్దూరి సతీష్, సమిశ్రగూడేనికి చెందిన తాతోలు రామకృష్ణ 17 మోటారుసైకిళ్ల దొంగతనం చేసినట్టు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.8.50లక్షలు ఉంటుందని చెప్పారు. ఉండ్రాజవరం పోలీసుస్టేషన్ పరిధిలో 2 కేసులు, తణుకులో 2, రాజమహేంద్రవరంలో 4, కొవ్వూరులో 3, పాలకొల్లు, ఏలూరు, గణపవరం, భీమవరం, నిడదవోలు, వీరవాసరం స్టేషన్లలో ఒక్కొక్కటి చొప్పున కేసులు నమోదైనట్లు ఆయన వివరించారు. మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్‌చేసి కోర్టుకు హాజరుపర్చినట్టు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం

● రాష్ట్ర పరంపర వైద్య సంఘ ఉపాధ్యక్షుడు జమాల్‌ఖాన్



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన పరంపర వైద్యుడు జమాల్‌ఖాన్, ఆనందయ్య

చింతూరు, ఏప్రిల్ 6: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుని తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర పరంపర వైద్య సంఘ ఉపాధ్యక్షుడు జమాల్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడారు. గడచిన ఐదేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా పరంపర వైద్యులను వైసీపీ ప్రభుత్వం వివిధ రకాలుగా ఇక్కట్లకు గురిచేసిందని ఆయన ఆరోపి ంచారు. రాష్ట్రవ్యాప్తంగా పరంపర వైద్యులు నాలుగువేల మంది వరకు ఉన్నా రని వారిలో దాదాపు 400 మంది వరకు టీడీయూ సర్టిఫికెట్ పొందిన వారు ఉన్నార న్నారు. ఈ క్రమంలో శనివారం పరంపర వైద్యుల రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్‌రాజు, గౌరవాధ్యక్షుడు ఆనందయ్యతోపాటు పలువురు చంద్రబాబు నాయుడుని కలసి తమ సమస్యలు చెప్పుకున్నారు. తరాలుగా వివిధ వ్యాధిగ్రస్థులకు ఉచిత సేవలు అందిస్తున్న పరంపర వైద్యులపై వైసీపీ ప్రభుత్వం అధికారులతో దాడులు చేయించిందన్నారు. దీంతో వేల మంది వ్యాధిగ్రస్థులకు నేడు ఎంతో ప్రాచుర్యం ఉన్న పరంపర వైద్యం అందకుండా పోయిందన్నారు. ఈ సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, దీంతో స్పందించిన చంద్రబాబు పరంపర వైద్యుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చింతూరుకు చెందిన తాను కొంతకాలంగా జేకే ట్రస్టు ద్వారా అగ్నిప్రమాద బాధితులకు, వరద బాధితులకు, పలు పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందించడంతోపాటు ఆర్థికసేవలు కూడా అందించా మన్నారు. ఈ క్రమంలో విలీన మండలాల్లో ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగినా వెనువెంటనే బాధితులను ఆదుకుంటున్నామన్నారు. రంపచోడవరం నియోజక వర్గంలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించడానికి కృషిచేస్తానని జమాల్ ఖాన్ అన్నారు.

టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

● మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి



కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

చింతూరు, ఏప్రిల్ 6: రాష్ట్రాభివృద్ధి కోసం ఎన్డీఏ నేతృత్వంలో తిరిగి చంద్రబాబుని సీఎం చేయడమే లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. శనివారం చింతూరు వచ్చిన వంతల కార్యకర్తలతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎండీ జహంగీర్, రామారావుచౌదరి, నర్సింహరావు, ఎం.వెంకటేశ్వరరావు, నాగమంగవేణి, బొక్కిలి మల్లయ్య, కరణం లక్ష్మయ్య, జాఫర్, సురేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం చట్టికి చెందిన చల్లా కోటేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొన్న వంతల రాజేశ్వరి బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

మండలంలో 99.40 శాతం పింఛన్లు పంపిణీ

రంపచోడవరం, ఏప్రిల్ 6: మండలంలో మంజూరైన సామాజిక భద్రతా పింఛన్లను 99.40శాతం పంపిణీ చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.హరికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం పింఛన్లను లబ్ధిదారులు 4,649 మంది కాగా, 4,621 మందికి గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల ద్వారా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేసినట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీ జిల్లాలో ప్రథమస్థానంలో నిలిపినందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు విజయసునీత సిబ్బందిని అభినంది ంచారన్నారు.

ఏజెన్సీలో మండుతున్న ఎండలు

● మోతుగూడెంలో 44 డిగ్రీలు ఉష్ణోగ్రత

మోతుగూడెం, ఏప్రిల్ 6: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న ఏజెన్సీలో ఎండలు మండిపోతున్నాయి. శనివారం ఏజెన్సీలో ఎండ ప్రభావం అధికంగా ఉండడంతో గరిష్ట కనిష్ట ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యాయి. మోతుగూడెంలో 44 డిగ్రీలు ఉష్ణోగ్రత ఒక్కసారి పెరిగిపోవడంతో ఎండ దాటికి తట్టుకోలేక జనం ఇళ్లకే పరిమితమయ్యారు. ఉదయం నుంచి ఉక్కపోత, వడగాల్పులు వీయడంతో ఉదయం 10గంటలకి మోతుగూడెం మార్కెట్ సెంటర్ వీధులు జనసంచారంలేక నిర్మానుష్యంగా ఉన్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే మేలో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

యువహో వాలీబాల్ టోర్నమెంట్



గెలుపొందిన జట్టుకు నగదు అందజేస్తున్న డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్

మోతుగూడెం, ఏప్రిల్ 6: జిల్లా ఎస్పీ తూహిన్‌సిన్హా, రంపచోడవరం ఓఎస్డీ కేవీ మహేశ్వరరెడ్డి, చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా, చింతూరు సీఐ గజేంద్రకుమార్ ఆదేశాలతో డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్ వై.రామవరం మండలం బొడ్డగండి గ్రామ పంచాయతీలోని మంగంపాడు గ్రామంలో గిరిజన యువతకు డొంకరాయి ఎస్‌ఐ యువహో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. బొడ్డగండి గ్రామ పంచాయతీలోని అప్పర్ పార్ట్ గ్రామాలైన బొడ్డగండి, రాకోట, ముట్లపాడు గ్రామాలు కలిపి ఒక టీమ్‌గా, లోయర్ పార్ట్ గ్రాం అయిన మంగంపాడు గ్రామ యువత ఒక టీమ్‌గా పెట్టి యువహో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో బొడ్డగండి టీమ్ గెలుపొందడంతో గెలిచిన బొడ్డగండి టీమ్‌కు రూ.1000లు నగదు, బహుమతి అందించారు. ఈ సందర్భంగా డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్ మాట్లాడుతూ గిరి యువత చైతన్యానికి తొలి అడుగు కింద యువహో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరి యువత చెడు అలవాట్లకు చెడు మార్గాలకు దూరంగా ఉండాలనే ఆశయంతో వాలీబాల్ టోర్నమెంట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం యువహో వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్న రాకోట, ముట్లపాడు గ్రామాలు యువతకు వాలీబాల్ కిట్ అందించారు.

రంపచోడవరంలో జనసేనకు ఇన్‌చార్జిలెవరూ లేరు

కూనవరం, ఏప్రిల్ 6: రంపచోడవరం నియోజకవర్గంలో జనసేనకు ఇన్‌చార్జిలు ఎవరూ లేరని జనసేన నాయకులు, కూనవరం మేజర్ సర్పంచ్ హేమంత్ గాంధీ, మండల పరిషత్ వైస్ ప్రెసిడెంట్ బండారు సాంబశివరావు అన్నారు. మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల వైసీపీ నుంచి కొంతమంది జనసేనలో చేరి తామే రంపచోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జిలమంటూ ఆర్భాట ప్రకటనలు చేస్తున్నారన్నారు. త్వరలోనే పవన్‌కల్యాణ్‌కు జనసేనను విచ్ఛిన్నం చేస్తున్న వైసీపీ వలసదారులపై ఫిర్యాదు చేస్తామన్నారు. సురేష్, బడుగుల వీరభద్రం, కన్నారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి సాయం అందజేత

కూనవరం, ఏప్రిల్ 6: ఇటీవల రోడ్డు ప్ర మాదంలో మృతి చెందిన ప్రభుత్వ ఉపా ధ్యాయుడు సాం బయ్య కుటుంబానికి రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబాన్ని పరామర్శించి అన్నివిధాలా టీడీపీ ఆదుకుంటుందన్నారు. సాంబయ్య భార్య గతంలో టీడీపీ తరుపున ప్రజాప్రతినిధురాలిగా గెలుపొంది అనేక విధాలుగా సాయం అందించిందన్నారు. జహంగీర్, ధనలక్ష్మి, బట్టు భాస్కర్ పాల్గొన్నారు.

మినరల్ వాటర్ సరఫరా

కూనవరం, ఏప్రిల్ 6: కూనవరం మేజర్ పంచాయతీలో మంచినీటి ఎద్దడి నెలకొనడంతో కూనవరం మండలానికి చెందిన కృష్ణార్జున ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంచినీటి సరఫరా చేశారు. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడడంతో ప్రజల కోరిక మేరకు మినరల్ వాటర్ రామాలయం వీధిలో పంపిణీ చేసినట్లు సభ్యుడు కె.కృష్ణార్జునరావు తెలిపారు.

బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయం

గండేపల్లి, ఏప్రిల్ 6: రైతుల సంక్షేమం, బలహీన వర్గాల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలో యల్లమిల్లి, నాయకంపల్లి గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. వైసీపీ పాలనలో రైతు సంక్షేమం పూర్తిగా కుంటుపడిందన్నారు. మధ్యతరగతి ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యారన్నారు. అవ్వ,తాతలకు ఇవ్వాల్సిన పింఛను సమయానికి ఇవ్వకుండా అవి కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమ చేశారన్నారు. వైసీపీని ఇంటికి పంపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు రావాల్సిన పథకాలు తీసేశారన్నారు.

ఎన్నికల విధుల్లో నిఘా బృందాలు కీలకం

▸ రాజమహేంద్రవరం రూరల్ ఆర్‌వో తేజ్‌భరత్

▸ పలు బృందాలకు విధులు, బాధ్యతలపై అవగాహన



అధికారులతో మాట్లాడుతున్న ఆర్వో తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించే ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాస్టికల్ సర్వైవల్ బృందాలు నిబద్ధత కలిగి ఉండాలని రాజమహేంద్రవరం రూరల్ ఆర్‌వో, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆదేశించారు. శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో వివిధ బృందాల(ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ) అధికారులకు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు వేసేందుకు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటికల్ సర్వైవల్, వీడియో సర్వైవల్ బృందాలు తనిఖీ నిర్వహించడంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. బెదిరింపులు, సంఘ విద్రోహుల తరలింపు, మద్యం, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ఓటర్లకు లంచాలు ఇవ్వడానికి పెద్దమొత్తంలో నగదు వంటి సబంధించిన అన్ని ఫిర్యాదులకు ఫ్లైయింగ్ స్క్వాడ్ స్పందించి దాడులు చేయాలన్నారు. అలాగే స్టాస్టికల్ సర్వైవల్ బృందాలు అక్రమ మద్యం, లంచంగా వస్తువులు పంపిణీ, ఆయుధాలు, సంఘవిద్రోహ శక్తుల కదలికలు వంటి వాటిపై నిఘా పెట్టాలన్నారు. వీడియో సర్వైవల్ బృందాలు సున్నిత సంఘటనలు, పెద్ద బహిరంగ సభలు, వీడియోగ్రఫీ సహాయ రిటర్నింగ్ అధికారి ప్రత్యేక పర్యవేక్షణలో స్వయంగా నిర్వర్తించాలన్నారు. సభలో కుర్చీలు, కటౌట్‌లు, పోస్టర్లు, వాహనాలు, అభ్యర్థి ఎన్ని వాహనాలు ప్రచారానికి వినియోగిస్తున్నారు వంటివి వీడియో రికార్డులు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ ఐ.సాయిబాబు, కొండయ్య ఏఆర్‌వోలు తహశీల్దార్లు వైకేవీ అప్పారావు, బి.రమాదేవి, ఎంపీడీవోలు, ఎంసీసీ, ఎస్ఎస్‌టీవీఎస్‌టీ సెక్టార్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌తో అవకాశాలు మెండు

▸ నన్నయ యూనివర్శిటీ వీసీ ఆచార్య పద్మరాజు



రీసోర్స్‌పర్సన్ జయసింహను సత్కరిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 6: భవిష్యత్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్‌కు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. నన్నయ వర్శిటీలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఫిజిక్స్ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. ఫిజిక్స్ కోర్సుతో బాటు క్వాంటమ్ కంప్యూటింగ్‌ను బోధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రీసోర్స్‌పర్సన్ శ్రీరామ్ జయసింహ మాట్లాడుతూ ప్రస్తుతం ఉపయోగించే గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జీపీఎస్) బదులుగా క్వాంటమ్ పొజిషనింగ్ సిస్టమ్ (క్యూపీఎస్) అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. క్యూపీఎస్ ఆవిష్కరణలో ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ వేగంగా ఫలితాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్‌వర్మ, న్యూఢిల్లీ ఎన్‌పీఎల్ విశ్రాంత శాస్త్రవేత్త భగవాన్‌నారాయణ, ప్రిన్సిపాల్స్ పి.విజయనిర్మల, వి.వెంకటేశ్వరరావు, డీన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీసోర్స్‌పర్సన్ జయసింహను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

టీసీఎస్‌లో ఉద్యోగాలకు రాత పరీక్ష

టీసీఎస్‌లో ఉద్యోగానికి సంబంధించిన రాతపరీక్షను నన్నయ వర్శిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. యూనివర్శిటీ ప్లేస్మెంట్ సెల్, వికాస సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షకు విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. దీనిలో ప్రతిభ కనబరచిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగవకాశాలు కల్పిస్తారని ప్లేస్మెంట్ అధికారి బి.జగన్మోహనరెడ్డి, తెలిపారు. కార్యక్రమంలో వికాస సంస్థ మేనేజర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు



సత్తిబాబుకు కండువా వేసి జనసేనలోకి ఆహ్వానిస్తున్న బత్తుల

రాజానగరం, ఏప్రిల్ 6: మండలంలోని కలవచర్ల మాజీ సర్పంచ్ భర్త, వైసీపీ నాయకుడు ఎర్ని సత్తిబాబు శనివారం వైసీపీకి రాజీనామా సర్పంచ్ పిల్లా రాజబాబు సమక్షంలో జనసేనలో చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు ఓశెట్టి సూర్యచంద్రరావు, అండుబోయిన సింహాచలం, అండుబోయిన రమణ, కొండా వెంకటరమణ తదితరులు జనసేనలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజబాబు, పిల్లా సత్తిబాబు, చల్లా నాగన్న, అడ్డాల వెంకటరమణ పాల్గొన్నారు.

బత్తులను గెలిపించాలి

కోరుకొండ, ఏప్రిల్ 6: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన-టీడీపీ-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణను గెలిపించాలంటూ మండలంలోని బొల్లేద్దుపాలెం, గాదరాడ గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు బలరామకృష్ణ, ఆయన సతీమణి బత్తుల వెంకటలక్ష్మి, కుమార్తెలు బత్తుల ప్రత్యూష, వందనాంబిక, తోట పవన్‌కుమార్, టీడీపీ నాయకులు మాదబోయిన అప్పారావు, కుప్పాల వెంకటరత్నం, గాదరాడ సర్పంచ్ దూది కాంతారావు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

పురందేశ్వరిని కలిసిన కూటమి నాయకులు



ఆదిరెడ్డి వాసు సమక్షంలో పురందేశ్వరిని కలిసిన నాయీబ్రాహ్మణ నేతలు

కోరుకొండ/రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 6: బీజేపీ-జనసేన-టీడీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిని శనివారం రాజానగరం నియోజకవర్గానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు ప్రకటించారు. పురందేశ్వరిని కలిసిన వారిలో ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, తోట పవన్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు తనకాల నాగేశ్వరరావు, మద్దాల రమణ, ఆడపా శ్రీనివాస్, రాపాటి సత్యానందం, పెనకటి శివాజీ తదితరులు ఉన్నారు. అలాగే దగ్గుబాటి పురందేశ్వరిని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ సమక్షంలో నాయీబ్రాహ్మణ నేతలు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, అలజంగి దేముడు, పెండ్యాల నాగేశ్వరరావు, కోరుమిల్లి నాగేశ్వరరావు, కోటిపల్లి చంద్రశేఖర్, కందికొండ అనంత్, తాడి దుర్గాప్రసాద్, పాత్రపల్లి సురేష్ పాల్గొన్నారు.



పురందేశ్వరిని కలిసిన జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ

డ్రీమ్స్‌లో గ్రాడ్యుయేషన్ డే



ధవళేశ్వరం, ఏప్రిల్ 6: ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్‌డే జరిగింది. సీఐ జీవీ వినయ్‌మోహన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రీప్రైమరీ పూర్తిచేసిన విద్యార్థులకు కిండర్ గార్డెన్ పట్టాలు అందజేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఎ.రమేష్, ప్రిన్సిపాల్స్ జి.విమలారోజి, కె.లలితాదేవి, వి.సంధ్యాకుమారి, ఎన్.దీపిక సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ పునః ప్రతిష్ఠోత్సవాలు

కొవ్వూరు, ఏప్రిల్ 6: కొవ్వూరు 12వ వార్డు బసివిరెడ్డిపేటలో శ్రీ రాజ్యలక్ష్మి గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ పునః ప్రతిష్ఠోత్సవాలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయార్చకులు స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేషార్చనలు జరిపారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దేవగుప్తాపు లక్ష్మణరావు, అర్చకులు గొడవర్తి జగన్నాధాచార్యులు, వేణు గోపాలాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొవ్వూరు కాంగ్రెస్ టిక్కెట్ స్థానికులకే ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 6: కొవ్వూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టును స్థానికులకే అందజేయాలని పార్టీ నాయకులు తీర్మానించారు. కొవ్వూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం నియోజకవర్గంలోని కాంగ్రెస్ మండలాధ్యక్షులు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకే టిక్కెట్టు కేటాయించాలని ఏకగ్రీవ తీర్మానం చేసి రాష్ట్ర అధ్యక్షురాలికి వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. ఇప్పటికే నిర్ణయించిన అభ్యర్థిని మార్పుచేసి స్థానిక నాయకులకు ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు, చాగల్లు మండలాల అధ్యక్షులు జొన్నకూటి రవికుమార్, బోనగిరి రాంబాబు, సాకా పుల్లారావు, మట్టా సుబ్బారావు, గెల్లా భాస్కరరావు, కొడమంచిలి చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడికి జవహర్ పరామర్శ



టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు అచ్చెన్నాయుడితో జవహర్ తదితరులు

కొవ్వూరు, ఏప్రిల్ 6: టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడిని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ పరామర్శించారు. అచ్చెన్నాయుడి తల్లి కళావతమ్మ ఇటీవల మృతిచెందారు ఈ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ గ్రామంలో అచ్చెన్నాయుడి స్వగృహంలో శనివారం పరామర్శించారు. కళావతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జవహర్ వెంట పసలపూడి బోసు, వేగి చిన్నా, కోడూరి ప్రసాద్, కరుటూరి సతీష్, వల్లభనేని సాయికృష్ణ, రావిపాటి శ్రీకృష్ణ, రావిపాటి రాధాకృష్ణ, కొప్పాక నరసయ్య, మెరిపో వెంకట్రావు తదితరులున్నారు.

26 మంది వలంటీర్లు రాజీనామా

తాళ్లపూడి, ఏప్రిల్ 6: మండలంలో పలు గ్రామాల వలంటీర్లు మూకు మ్మడిగా రాజీనామాలు చేస్తున్నారు. శనివారం గజ్జరం గ్రామం నుంచి 14, పోచవరం గ్రామం నుంచి 12 వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో వెంకటరమణకు అందించారు. కొన్ని రాజకీయ పార్టీల నాయకుల మాటలకు మనస్తాపం చెంది తమ పదవులకు రాజీనామాలు చేస్తున్నట్టు వారు తెలిపారు. ఇటీవల మలకపల్లిలోని 13 మంది, తాడిపూడిలో ఒకరు రాజీనామాలు చేశారని మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

గోటితో వలిచిన తలంబ్రాలు అందజేత

నల్లజర్ల, ఏప్రిల్ 6: భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణం నిమిత్తం మండలంలోని జగన్నాథపురంలో గోటితో వలిచిన తలంబ్రాలను శుక్రవారం జంగారెడ్డిగూడెం శ్రీరామ ఆధ్యాత్మిక సేవ సమితి సభ్యులకు అందజేశారు. ముందుగా కోరా కన్నయ్య, కండెపు ప్రసాద్, గారపాటి అశ్వంత్ దంపతులు శోభాయాత్ర నిర్వహించి, ప్రత్యేక పూజల అనంతరం జంగారెడ్డిగూడెం తీసుకెళ్లారు. ఏటా జగన్నాథపురం భజన మండలి మహిళలు, రామభక్తులు గోటితో వలిసిన తలంబ్రాలను భద్రాచలం రాముడి సన్నిధికి పంపించడం ఆనవాయితీ. కార్యక్రమంలో సవలం రామకృష్ణ, మైనం వెంకట బ్రహ్మయ్య, గన్నిన సుబ్బారావు, పాము శ్రీను, శ్రీపాద సాయి, కటూకూరి శ్రీను, కె.నాగార్జున పాల్గొన్నారు.

వేమగిరిలో గద్దర్ జయంతి

కడియం, ఏప్రిల్ 6: వేమగిరిలో ఎన్టీఆర్, ఘంటసాల అభిమాని ప్రత్తి పాటి నల్లరాజు ఆధ్వర్యంలో గద్దర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమలో సాయిరామ్ ఆటోయూనియన్ సభ్యులు, గద్దర్ అభిమానులు పాల్గొన్నారు.

సమ్మేటివ్- 2 పరీక్షలు ప్రారంభం

రంగంపేట, ఏప్రిల్ 6: ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో సమ్మేటివ్-2 (వార్షిక) పరీక్షలు ప్రారంభమయ్యాయని ఎంఈవో కె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ శనివారం తెలుగు సబ్జెక్టుతో ప్రారంభమై ఈ నెల 18వ తేదీతో పూర్తవుతాయన్నారు. టోఫెల్ పరీక్ష ప్రశ్నపత్రాలు కూడా సిద్ధం చేశామన్నారు. వేసవిలో రెండో పూట తరగతులు నిర్వహించకూడదని, వడదెబ్బ తగలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు విద్యార్థులకు తెలియజేసి చైతన్య పరచాలని ఆయన కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తరగతులు, పరీక్షలు నిర్వహించాలని చెప్పారు.

దుప్పలపూడిలో 'న్యాయం కోసం నల్లమిల్లి'



దుప్పలపూడిలో కుటుంబ సభ్యులతో కలిసి పర్యటిస్తున్న నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 6: ప్రజలు, టీడీపీ శ్రేణుల ఆకాంక్షలు నెరవేరే సమయం ఆసన్నమైందని, నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పోటీలో ఉంటుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ సీటును కోల్పోయిన ఆయన చేపట్టిన న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమాన్ని శనివారం మండలంలోని దుప్పలపూడిలో నిర్వహించారు. తన తల్లి సత్యవతి, సతీమణి మహాలక్ష్మి, తనయుడు మనోజ్‌రెడ్డి తనయ డాక్టర్ సనాతనితో కలిసి పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. పలు చోట్ల వృద్ధులు భావోద్వేగానికి లోనవడంతో వారిని నల్లమిల్లి ఓదార్చారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, ఆళ్ల గోవిందు, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, జుత్తుగ సూర్యకుమారి, సిరసపల్లి లక్ష్మి, పోతంశెట్టి సుభాషిణి, ఒంటిమి గౌతమి పాల్గొన్నారు.

జి.దొంతమూరులో 'ఆరోగ్య సురక్ష'



వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న డాక్టర్ చిన్నారావు

రంగంపేట, ఏప్రిల్ 6: జి.దొంతమూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం పీహెచ్‌సీ వైద్యులు కె.చిన్నారావు అధ్యక్షతన ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 386 మందికి ఈసీజీ, రక్తపరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో కొందరిని మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఆర్.పార్వతిబాయ్, జి.గౌతమ్, ఇందిర, సీహెచ్‌వో కె.జయమణి, ఎంపీహెచ్‌ఈవో పి.ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ మణికంఠ, గ్రామ కార్యదర్శి శాంతిగూరి, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

రాజమహేంద్రవరం కమిషనర్ దినేష్‌కుమార్



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ,ఏప్రిల్ 6: రాజమహేంద్రవరంలో జరుగుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ కే.దినేష్ కుమార్ ఆదేశించారు. నగరంలో సంస్కృత కాలేజీ నుంచి పేపరుమిల్లు వెళ్లే రోడ్డు, టీచర్స్ కాలనీ, మెయిన్ రోడ్డు, రంగ్రీజుపేట రోడ్డు, నాగుల చెరువు డ్రైన్ పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పనులు పూర్తి నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలన్నారు. రోడ్డు మందాన్ని పరిశీలన చేశారు. నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను 14 రోజుల పాటు తప్పనిసరిగా తడపాలన్నారు. శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఈ జి.పాండురంగారావు, ఈఈ శేషగిరిరావు, మదర్‌షా అలీ, డీఈఈ ప్రకాశరావు, చంద్రశేఖరరావు, అసిస్టెంట్ ఇంజనీర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు ఐ.శ్రీనివాస్, సయ్యద్ ఖాసిం పాల్గొన్నారు.

ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇంటింటా ప్రచారం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 6: కూటమి అధికారంలోకి వస్తే యువతకు ఉపాధి కల్పించడంతో పాటు బంగారు భవిష్యత్తు చూపిస్తామని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 42వ డివిజన్ మునిసిపల్ కాలనీలో టీడీపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మళ్ల వెంకట్రాజు, ఆదారి లక్ష్మీనారాయణ, దుద్దేటి నాగేంద్ర యాదవ్, కేవీ శ్రీనివాస్, మోతా పండు, కొండబాబు పాల్గొన్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	సా. 6.25
సహరి(సోమ)	ఉ. 4.30

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	42.0	24.0


బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న పురందేశ్వరి


పురందేశ్వరి దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నల్లమిల్లి

రెండో రోజు బిజీబిజీగా పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్/అనపర్తి, ఏప్రిల్ 6 : రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి రెండో రోజు బిజీబిజీగా గడిపారు. రాజమహేంద్రవరంలో శనివారం ఉదయం బీజేపీ కార్యాలయాన్ని దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఒక ప్రైవేట్ హోటల్‌లో రాజమహేంద్రవరం నియోజకవర్గ కూటమి నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం పలువురు నాయకులు ఆమెను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రాజమహేంద్రవరం కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం శనివారం రాత్రి అనపర్తి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కలిశారు. బీజేపీకి కేటాయించిన అసెంబ్లీ సీటును విజయావకాశాల ప్రాతిపదికను తిరిగి టీడీపీకి కేటాయించేందుకు సంప్రదింపులు పూర్తయిన నేపథ్యంలో వీరి కలయిక ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే అనపర్తి సీటుపై నల్లమిల్లికి చంద్రబాబు భరోసా ఇచ్చారు.ఈ నేపథ్యంలో ఈ భేటీ ఆసక్తిగా మారింది.సీనియర్ నాయకుడు గంగిన నారాయణరావు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా స్టేట్ ఇన్‌ఛార్జి సిద్ధార్థనాథ్ సింగ్ నారాయణరావుకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ల్యాండ్ లార్డు ముళ్లపూడి శ్రీనివాస్ బీజేపీలో చేరారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి జీరో.. 8

పంచాయతీలకు పవర్ కట్

- పంచాయతీల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు
- గోపాలపురం మండలంలోనే రూ.2 కోట్లు పెండింగ్

గోపాలపురం, ఏప్రిల్ 6 : పంచాయతీ పవర్ కట్ అయిపోతోంది. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు పైసా కూడా విదల్చలేదు. పైగా వచ్చిన ఆర్థిక సంఘం నిధులు దారిమళ్లించారు. దీంతో ఐదేళ్ల తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎంతలా అంటే కనీసం విద్యుత్ బిల్లులు చెల్లించలేనంతగా పంచాయతీల్లో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. జిల్లా వ్యాప్తంగా చాలా పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. విద్యుత్ బకాయి చెల్లించకపోవడంతో గోపాలపురం పంచాయతీ కార్యాలయానికి విద్యుత్ సరఫరా అధికారులు శనివారం నిలిపివేశారు. మండలంలో 18గ్రామ పంచాయతీల్లో ఉన్న వీధిలైట్లు, మంచినీటిబోర్లు, పంచాయతీ కార్యాలయాలకు సంబంధించిన రూ2 కోట్ల బకాయి ఉంది. ఒక గోపాలపురంలోనే సుమారు రూ.22.5 లక్షలు విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో విద్యుత్ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయమైన సమాచారం. 2022-23 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైనప్పటికీ మిగిలిన పంచాయతీల్లో కొన్ని పంచా యతీలు 10 శాతం, మరికొన్ని పంచాయతీలు 20 శాతం అప్పును చెల్లించాయి. గోపాలపురం గ్రామ పంచాయతీలో మాత్రం విద్యుత్ బకాయి చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు సరఫరా నిలిపివేశారు.



ఫ్యాన్‌కు ముచ్చెమటలు!

లోక్‌సభలో త్రిముఖం

- వైసీపీ గుండెల్లో గిడుగు పిడుగు
- ఫ్యాన్ ఓట్లను చీల్చనున్న కాంగ్రెస్ అభ్యర్థి
- కూటమికి కలిసిరానున్న మూడు పార్టీలు
- 2019 ఎన్నికల్లో మూడింటికి 50శాతం ఓట్లు
- అయోమయంలో అభ్యర్థులు
- రాజమహేంద్రవరంలో రసవత్తర పోరు


పురందేశ్వరి డాక్టర్ గూడూరి గిడుగు రుద్రరాజు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం లోక్‌సభ ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి. 2019లో త్రిముఖ పోటీ జరిగింది. నాడు టీడీపీ, జనసేన, వైసీపీ అభ్యర్థులు పోటీపడ్డారు. ఈ సారి ప్రధానంగా ద్విముఖ పోటీనే ఉన్నప్పటికీ నేనూ ఉన్నానంటూ కాంగ్రెస్ అభ్యర్థి బరిలో దిగారు. గత ఎన్నికల్లో వేర్వేరుగా పోటీ చేసిన టీడీపీ-జనసేన-బీజేపీ ఒక కూటమిగా ఏర్పడి ఈ ఎన్నికల బరిలో దిగాయి.పైగా కూటమి అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఆమె ఎన్టీఆర్ కూతురు కావడం, మరొక పక్క టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి సోదరి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అంతేకాకుండా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు కావడం ఇంకా కలిసొచ్చే అంశం. పైగా జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమికి బలమైన అభ్యర్థులు ఉన్నారు. అనపర్తి సీటు మారనుంది. టీడీపీకి తిరిగి రానుంది. మొదట టీడీపీకి కేటాయించిన ఈ సీటు పొత్తులో భాగంగా బీజేపీకి ఇచ్చిన సంగతి తెలిసిందే. కానీ అక్కడ బీజేపీ అభ్యర్థి అంతబలవంతుడు కాకపోవడంతో, తిరిగి టీడీపీకే ఈసీటు ఇవ్వడానికి నిర్ణయించుకున్నట్టు సమాచారం. దీంతో ఏడు నియోజకవర్గాల్లోనూ హేమాహేమీలు ఉన్నట్టే. ఇక వైసీపీ తరపున రాజకీయాలు అంతగా తెలియని డా. గూడూరి శ్రీనివాసరావు బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో త్రిముఖ పోటీ వల్ల ఇక్కడ వైసీపీ గెలిచింది. అప్పుడు టీడీపీ -జనసేన, బీజేపీ ఓట్లు కూడా చీలిపోయాయి. ఈసారి మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి ఒక్కటిగా పోటీ చేస్తుండడంతో కూటమి అభ్యర్థిని వైసీపీ అభ్యర్థి తట్టుకోవడం కష్టమే. పైగా అధికార వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. అన్ని వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. లోక్‌సభ పరిధిలో వైసీపీ చేసింది శూన్యం. దీంతో ఈ అభ్యర్థికి ఎదురీతే.ఇదిలా ఉండగా ఈసారి కాంగ్రెస్ తరపున బలమైన అభ్యర్థి రంగంలోకి దిగారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ అధిష్ఠానం రాజమహేంద్రవరం అభ్యర్థిగా బరిలోకి దింపింది. స్థానికంగా ఆయనకు పరిచయస్తులు ఎక్కువ. గతంలో కాంగ్రెస్‌లో ఉండి మౌనంగా ఉంటున్న నేతలు కూడా అయనకు మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. గతంలో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ విభజన తర్వాత వైసీపీ ఓటు బ్యాంక్‌గా మారింది. ఇవాళ కాంగ్రెస్ కూడా బలంగా వస్తుండడం, పైగా గిడుగు రుద్రరాజు బలమైన అభ్యర్థి కావడం వల్ల సంప్రదాయ కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌ను మళ్లీ ఆకర్షించి లాక్కునే అవకాశం ఉన్నట్టు పరిశీలకులు అంచనా వేస్తు న్నారు. దీంతో అసలే కష్టాల్లో ఉన్న వైసీపీ ఓటు బ్యాంక్‌కు రుద్రరాజు ఎంతో కొంత గండికొడతారనే అంచనా ఉంది.దీంతో కాంగ్రెస్ అభ్యర్థి గిడుగు వైసీపీ గుండెల్లో పిడుగుగా తయారయ్యారు.

18న ఎన్నికల నోటిఫికేషన్..

ఈ నెల 18న నోటిఫికేషన్ రానుంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. మే 13న పోలింగ్ జరగనుంది. పోలింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలు కావడంతో అభ్యర్థులంతా ప్రచారం జోరు పెంచారు. కూటమి అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరి రాజమహేంద్రవరంలో శనివారం ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు కూడా ప్రచారంలో దూసుకుపోతున్నారు. తెలు గుదేశం అధినేత నారా చంద్రబాబు జిల్లాలో రెండు రోజుల పర్యటనతో అసంతృప్తులు కూడా బాగా తగ్గిపోయాయి. దీంతో కూటమిలో కొత్త ఉత్సాహం నెలకొంది.

ఓటులోనూ కూటమిదే పైచేయి..

రాజమహేంద్రవరం లోక్‌సభ పరిధిలో కాంగ్రెస్‌కు మంచి ఓటు బ్యాంక్ ఉండేది. టీడీపీ ఏర్పడిన తర్వాత 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ మూడు సార్లు, బీజేపీ రెండు సార్లు, కాంగ్రెస్ నాలుగు సార్లు, వైసీపీ ఒకసారి గెలిచాయి. అంటే మొత్తం 10 ఎన్నికల్లో టీడీపీ-బీజేపీలు 5 సార్లు, కాంగ్రెస్, వైసీపీలు 5 సార్లు గెలిచాయి.ఈ సారి 11వ సారి జరిగే ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా పోటీ చేస్తుండగా వైసీపీ ఒంటరిగా పోటీ చేస్తుంది. కాంగ్రెస్, వామపక్షాల సహకారంతో పోటీ చేస్తోంది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఎన్‌వి.శ్రీనివాస్‌కు 12,725 ఓట్లు వచ్చాయి. ఇవి 1శాతం మాత్రమే. బీజేపీకి అంతే కంటే తక్కువగా 12,334 ఓట్లు వచ్చాయి. అభ్యర్థిగా పరవస్తు సత్య గోపినాథ్‌దాసు పోటీ చేశారు. అతనికి 1 శాతమే వచ్చాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి నోటా కంటే తక్కువ ఓట్లు రావడం గమనార్హం. నోటాకు 18,087 ఓట్లు లభించాయి. ఇవి కూడా 1 శాతమే. మరో ఆరుగురు స్వతంత్రులు పోటీ చేసినా వారందరికీ కలిపి 10 వేల లోపు మాత్రమే ఓట్లు లభించాయి. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిని బట్టి కూడా ఓట్లు పెరగడం గమనార్హం. 2014లో విభజన కోపం ఉన్న సమయంలోనే కందుల దుర్గేష్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయగా 21,243 ఓట్లు వచ్చాయి. తర్వాత ఎన్నికలలో అభ్యర్థి మారడంతో ఓట్లు తగ్గాయి. ఇవాళ గిడుగు రుద్రరాజుకు ఎక్కువ ఓట్లు వస్తాయని, అవి కూడా వైసీపీ నుంచి ఎక్కువగా ఆయనకు బదిలీ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇక 2019 ఎన్నికల్లో టీడీపీ-జనసేన, బీజేపీ విడివిడిగా పోటీ చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో టీడీపీ అభ్యర్థి మాగంటి రూపకు 4,60,390 ఓట్లు లభించాయి. ఇవి 37 శాతం ఓట్లు. జనసేన తరపున పోటీ చేసిన డా. ఆకుల సత్యనారాయణ 1,55,807 ఓట్లు వచ్చాయి. ఇవి 12 శాతం ఓట్లు. బీజేపీకి 12,334 ఓట్లు వచ్చాయి. ఇవి 1శాతం. అంటే ఇవన్నీ కలసి తెచ్చుకున్న ఓట్లు 50 శాతం. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్‌కు 5,82,024 ఓట్లు 47 శాతం వచ్చాయి. ఇవాళ టీడీపీ-జనసేన,బీజేపీ కలసి కూటమిగా పోటీ చేస్తుండడంతో కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందే శ్వరికి బలం పెరిగింది.కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్య కాంగ్రెస్- వామపక్షాల ఉమ్మడి అభ్యర్థి ఎంత ప్రభావం చూపుతారో చూడాలి.ఇప్పటికే అంతా ప్రచారాలు ప్రారంభించారు.

సూరీడ్‌కి.. చిక్కవద్దు!



ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయ్ జాగ్రత్త

ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగ మండిపోతున్నాడు. మధ్యాహ్నం సమయానికి తన ప్రతాపం చూపుతున్నాడు. ఈ నెలలోనే చూస్తే గత వారం రోజులుగా 40 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదు కాలేదు. ఇక శుక్రవారం అయితే జనం మాడిపోయారు. ఎందుకంటే ఏకంగా ఈ ఏడాది తొలిసారి రాజమహేంద్రవరంలో 44 డిగ్రీల ఉష్ణో గ్రత నమోదైంది. దీంతో తీవ్ర వడగాడ్పులు వీస్తున్నాయి. వాతావరణం మారిన నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తపై ప్రత్యేక కథనం..

- వడదెబ్బ ప్రాణాంతకం
- పిల్లలు..వృద్ధులు..గర్భిణులకు ఇబ్బందే
- ఎండ పెరిగితే ఇంటి పట్టునే ఉండాలి
- కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి
- వడదెబ్బకు గురైతే చెమట పట్టదు
- రోడ్లపై ఆహారం సేవించకూడదు
- చల్లని రంగు నీళ్లకు దూరంగా ఉండాలి
- రోజూ 15 గ్లాసుల నీళ్లు తాగాలి
- వడదెబ్బ తగిలిన వారికి నీళ్లు తాగించొద్దు

కొవ్వూరు, ఏప్రిల్ 6 : వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రత, వడగాడ్పుల కారణంగా వడదెబ్బ (సన్‌స్ట్రోక్), డీ హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది..సరైన సమయంలో చికిత్స తీసుకోకుంటే ప్రాణాంతకంగా మారవచ్చునని దొమ్మేరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్.ధర్మరాజు తెలిపారు. వడదెబ్బ (సన్‌స్ట్రోక్) కారణంగా శరీరంలోని ఉష్ణోగ్రత నియంత్రణ శక్తి కోల్పోతోంది. శరీర ఉష్ణోగ్రత పెరిగిపోతోంది. దీంతో శరీరంలోని అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుంది. ఎక్కువగా, పిల్లలు, గర్భిణులు పెద్ద వయసు వారు జాగ్రత్తలు పాటించాలి. అధికంగా ఎండ ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఇంటిపట్టునే ఉండాలి. అత్యవసర సమయంలో బయటకు వెళ్లవలసి వస్తే గొడుగు లేక తలకు టోపీ వంటివి ధరించాలి.

- **డీ హైడ్రేషన్ :** వేసవి తీవ్రత కారణంగా వచ్చే డీహైడ్రేషన్‌తో డయేరియా,వాంతులు,జ్వరం వస్తాయి. శరీరంలో నీటి శాతం తగ్గి కళ్ళు తిరిగే ప్రమాదం ఉంది.
- **లక్షణాలు :** చర్మం ఎర్రగా కావడం, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండడం,శరీరంపై ఎర్రటి పొక్కులు రావడం, నీరసం, తీవ్ర జ్వరం, తలనొప్పి, మానసిక ఒత్తిడి, కళ్ళు తిరగడం,వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర లేదా కలవరింతలు, ఫిట్స్ లేదా అపస్మారకస్థితి కలుగుతుంది. ఇలా జరిగితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

చేయకూడనివి..

- తీవ్ర ఉష్ణోగ్రతలు ఉంటే ఎక్కువగా తిరగరాదు.
- రోడ్లపైవిక్రయించే చల్లని పానీయాలు తాగరాదు
- రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినరాదు.
- మద్యం సేవించరాదు.. మాంసాహారం తగ్గించాలి..
- తాజా కూరగాయలను ఆహారంగా తీసుకోవాలి.

చేయాల్సినవి...

- నీరు, పండ్ల రసాలు, కొబ్బరినీళ్ళు, మజ్జిగ, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
- నలుపు, మందంగా ఉండేవాటికి బదులు లేత రంగుల్లో లభించే తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి.
- రోజు కనీసం 15 గ్లాసుల నీళ్ల తాగాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి.ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి. ఎండవేళ బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపి ధరించాలి.

ప్రథమ చికిత్స ఇలా చేయాలి..

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని నీడ ప్రదేశానికి చేర్చాలి.
- శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం అంతా తుడవాలి.
- ఫ్యాను గాలి, చల్లని గాలి తగిలేలా ఉంచాలి
- ఉప్పు కలిపిన మజ్జిగ (లేదా) చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం, (లేదా) ఓరల్ డీహైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) తాగించాలి.
- పిల్లలు, గర్భిణులు, వృద్ధుల పట్ల శ్రద్ధ తీసుకోవాలి.
- వడదెబ్బ తగిలి అపస్మారక పరిస్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలి.


బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో ఓఆర్ఎస్ కార్నర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

ప్రభుత్వ కార్యాలయాల్లో ఓఆర్ఎస్ కార్నర్

బిక్కవోలు, ఏప్రిల్ 6 : వడదెబ్బకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా. ఎం.దుర్గాదేవి సూచించారు.ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో ఓఆర్ఎస్ కార్నర్‌ను ఏర్పాటు చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను లీటరు నీటిలో కలిపి తరచూ తీసుకుంటే వడదెబ్బకు గురి కాకుండా ఉంటామని తెలిపారు. వృద్ధులు, పెద్దలు ఇంటి నుంచి పనులపై బయటకువెళ్లేవారు ఉదయం 11 గంటల లోపు తిరిగి రావాలని, అలాగే సాయంత్రం 4 గంటల తరువాత మరలా బయటకు వెళ్లాలన్నారు. తెల్లని పలుచని కాటన్ దుస్తులు ధరిస్తే మంచిదన్నారు. ఈ కార్నర్‌లను తహశీల్దార్, పోలీస్‌స్టేషన్, మండలంలోని ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భవాని, ఏవో శామ్యూల్‌జాన్, ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టైరు పేలి.. యాసిడ్ ట్యాంకర్ బోల్తా



తాళ్ళపూడి, ఏప్రిల్ 6 : పెనుప్రమాదం త్రుటిలో తప్పింది.. సగ్గొండ ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీ నుంచి శుక్రవారం అర్ధరాత్రి రాజమహేంద్రవరానికి యాసిడ్ ట్యాంకర్ బయలుదేరింది. తాళ్ళపూడి ఏటిగట్టు మీద ఒక్కసారిగా ట్యాంకర్ టైరు పేలిపోయింది. డ్రైవర్‌కు అదుపు చేసే అవకాశం లేకపోవడంతో అదుపుతప్పి ఏటుగట్టు కిందకి దొర్లి బోల్తా పడింది. రాత్రి సమయంలో జరిగిన ఈ ప్రమాద సంఘటన గ్రామస్థులకు తెలియడంతో అంతా కంగారుపడ్డారు. ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడ్డారు. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రమాదం కానీ, పాణనష్టం గానీ జరుగలేదు. ఈ మేరకు సమాచారం అందడంతో శనివారం ఉదయం కొవ్వూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి ట్యాంకర్ పేలకుండా చర్యలు చేపట్టారు. అనంతరం బోల్తా పడిన లారీలోని యాసిడ్‌ను వేరే లారీలోకి నింపి తరలించారు. ఇదిలా యాసిడ్ లారీని ప్రక్కకు తరలించే సమయంలో విద్యుత్ వైర్లు తగిలి ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతన్ని కొవ్వూరు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.


చంద్రబాబుకు చెక్ అందజేస్తున్న కన్నయ్య

చంద్రబాబుకు పార్టీ ఫండ్ రూ.కోటి అందజేత

నల్లజర్ల,ఏప్రిల్ 6 : టీడీపీకి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. నల్లజర్లలో శుక్రవారం చంద్రబాబుకు అదే గ్రామానికి చెందిన కోరా కన్నయ్య దంపతులు రూ. కోటి పార్టీ ఫండ్‌ను అందించారు.74 ఏళ్ల వయసులో సైతం రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం నిరంతరం తపన పడుతున్న చంద్రబాబుకు తమ కుటుంబం అండగా ఉంటుందన్నారు.అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్న మా అబ్బాయి వంశీ కోరిక మేరకు పార్టీ ఫండ్ అందించినట్టు శనివారం చెప్పారు.


సమాధి వద్ద పూజలు చేస్తున్న శాంతకుమారి

సాధు అమ్మ సమాధిని దర్శించుకున్న తెలంగాణ సీఎస్

ఉండ్రాజవరం, ఏప్రిల్ 6 : చివటం గ్రామంలో సాధు అమ్మవారి సమాధిని తెలంగాణ సీఎస్ ఎ.శాంతకుమారి శనివారం దర్శించుకున్నారు. సుమారు రెండు గంటల పాటు అమ్మవారి ఆలయం, ఇతర ఆలయాల్లో ఆమె పూజలు చేశారు. రచయిత ఎక్కిరాల భరద్వాజ రచించిన అమ్మవారి చరిత్ర చదివి దర్శనానికి వచ్చినట్టు సీఎస్ తెలిపారు.తహశీల్దార్ నవీన్‌కుమార్,కార్యదర్శి కృష్ణవేణి, వీఆర్వోలు ఆమెకు స్వాగతం పలికారు.ఆశ్రమ సంఘ అధ్యక్షురాలు కరుటూరి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న దమ్మాలపాటి కృష్ణమోహన్

న్యాయవాదుల పాత్ర కీలకం

టీడీపీ లీగల్ సెల్ వర్క్‌షాప్‌లో కృష్ణమోహన్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 6 : సార్వత్రిక ఎన్నికల్లో న్యాయవాదులు కీలకంగా వ్యవహరించాలని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దమ్మాలపాటి కృష్ణమోహన్ ,రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ళ సుబ్బారావు అన్నారు. టీడీపీ లీగల్ సెల్ ఇన్‌చార్జి గన్నికృష్ణ ఆధ్వర్యంలో మోరంపూడి గన్నిస్ శుభమస్తు ఫంక్షన్ హాలులో జోన్ -2 పరిధిలో ఉన్న ఐదు పార్లమెంట్, 35 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని లీగల్ సెల్ సభ్యులకు, పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులపై వర్క్‌షాప్ నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గన్నికృష్ణ మాట్లాడుతూ అధికార పార్టీ కుట్రలను తిప్పికొట్టాలన్నారు.టీడీపీ లీగల్ సెల్ ముఖ్యప్రతినిధి కృష్ణ మోహన్ మాట్లాడుతూ ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో లౌడ్ స్పీకర్, రోడ్ షో‌సమావేశాలకు మాత్రమే ఆర్‌వో నుంచి అనుమతులు తీసుకోవాలని మిగిలిన వాటికి అక్కర్లేదన్నారు.ముప్పాళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ న్యాయవాదులు క్రియాశీలకంగా వ్యవహరించాలని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం నామినేషన్ కూడా వేసే పరిస్థితి లేకుండా రాక్షస పాలన చూశామన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ చాలా మంది అధికారులు ప్రభుత్వానికి తొత్తులుగా పనిచేస్తున్నారన్నారు.గత నాలుగేళ్లలో మూడేళ్లగా ఒకే చోట పని చేస్తున్న అధికారులను గుర్తించి బదిలీ చేయాలన్నారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ అధికార పక్షం చేస్తున్న అరాచకాలను ఎదుర్కొవాలంటే టీడీపీ లీగల్ సెల్ సేవలు అవసరమన్నారు. రానున్న 40 రోజుల్లో లీగల్ సెల్ అభ్యర్థుల పక్షాన నిలబడాలని విజ్ఞప్తి చేశారు.ఈ వర్క్‌షాప్‌లో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొడులూరు వెంకటేశ్వరరావు, హైకోర్టు న్యాయవాదులు చంద్రారెడ్డి, గూడపాటి లక్ష్మీనారాయణ, హరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడబాల రామారావు, పబ్బినేని విజయ్, రాజమండ్రి బార్ కార్యదర్శి రమేష్, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి పంతం సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి సునీల్, రాజమండ్రి బార్ మాజీ అధ్యక్షుడు అమ్మన్నచౌదరి, కాకినాడ జిల్లా అధ్యక్షుడు నాగబాబు, కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, యర్రా వేణుగోపాలరాయుడు, కాశి నవీన్ కుమార్, వాసిరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

కొవ్వూరు కాంగ్రెస్ టిక్కెట్ స్థానికులకే ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 6: కొవ్వూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టును సాథనికులకే అందజేయాలని పార్టీ నాయకులు తీర్మానించారు. కొవ్వూరు ప్రెస్క్లబ్‌లో శనివారం నియోజకవర్గంలోని కాంగ్రెస్ మండలాధ్యక్షులు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకే టిక్కెట్టు కేటాయించాలని ఏకగ్రీవ తీర్మానం చేసి రాష్ట్ర అధ్యక్షురాలికి వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. ఇప్పటికే నిర్ణయించిన అభ్యర్థిని మార్పుచేసి స్థానిక నాయకులకు ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు, చాగల్లు మండలాల అధ్యక్షులు జొన్నకూటి రవికుమార్, బోనగిరి రాంబాబు, సాకా పుల్లారావు, మట్టా సుబ్బారావు, గెల్లా బాస్కరరావు, కొడమంచిలి చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ పునః ప్రతిష్ఠోత్సవాలు

కొవ్వూరు, ఏప్రిల్ 6: కొవ్వూరు 12వ వార్డు బసివిరెడ్డిపేటలో శ్రీ రాజ్యలక్ష్మి గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ పునః ప్రతిష్ఠోత్సవాలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయార్చకులు స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేషార్చనలు జరిపారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దేవగుప్తాపు లక్ష్మణరావు, అర్చకులు గొడవర్తి జగన్నాధాచార్యులు, వేణు గోపాలాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడికి జవహర్ పరామర్శ



టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు అచ్చెన్నాయుడితో జవహర్ తదితరులు

కొవ్వూరు, ఏప్రిల్ 6: టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడిని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ పరామర్శించారు. అచ్చెన్నాయుడి తల్లి కళావతమ్మ ఇటీవల మృతిచెందారు ఈ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ గ్రామంలో అచ్చెన్నాయుడి స్వగృహంలో శనివారం పరామర్శించారు. కళావతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జవహర్ వెంట పసలపూడి బోసు, వేగి చిన్నా, కోడూరి ప్రసాద్, కరుటూరి సతీష్, వల్లభనేని సాయికృష్ణ, రావిపాటి శ్రీకృష్ణ, రావిపాటి రాధాకృష్ణ, కొప్పాక నరసయ్య, మెరిపో వెంకట్రావు తదితరులున్నారు.

26 మంది వలంటీర్లు రాజీనామా

తాళ్లపూడి, ఏప్రిల్ 6: మండలంలో పలు గ్రామాల వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నారు. శనివారం గజ్జరం గ్రామం నుంచి 14, పోచవరం గ్రామం నుంచి 12 వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో వెంకటరమణకు అందించారు. కొన్ని రాజకీయ పార్టీల నాయకుల మాటలకు మనస్తాపం చెంది తమ పదవులకు రాజీనామాలు చేస్తున్నట్టు వారు తెలిపారు. ఇటీవల మలకపల్లిలోని 13 మంది, తాడిపూడిలో ఒకరు రాజీనామాలు చేశారని మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

పురందేశ్వరిని కలిసిన ముప్పిడి



కొవ్వూరు, ఏప్రిల్ 6: బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని కూటమి కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రాజమహేంద్రవరం చెరుకూరి వీర్రాజు కల్యాణ మండపంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సమన్వయ సదస్సు శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు పురందేశ్వరిని కలుసుకుని స్వాగతం పలికారు.

వృద్ధులకు నూతన దుస్తులు అందజేత

గోపాలపురం, ఏప్రిల్ 6: పెద్దగూడెంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం అన్నదానం నిర్వహించారు. అనంతరం 2023లో పదో తరగతిలో 580 మార్కులు సాధించిన మెరిపో ధీరజ్‌వర్ధన్‌ను చర్యవాణి స్కూల్ ప్రిన్సిపాల్ రాపాక ఫణికిషోర్ మాతృమూర్తి శాంతకుమారి జ్ఞాపకార్థం మెమోరియల్ అవార్డు బహూకరించారు. ఈ సందర్భంగా వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తానేటి వీరరాఘవులు, చినవెంకటేశ్వరరావు, మెరిపో ప్రసాద్, కొడమంచిలి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రాముడికి గోటితో వలిచిన తలంబ్రాలు



గోటితో వలిచిన తలంబ్రాలతో భక్తులు

నల్లజర్ల, ఏప్రిల్ 6: భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణం నిమిత్తం మండలంలోని జగన్నాథపురంలో గోటితో వలిచిన తలంబ్రాలను శుక్రవారం జంగారెడ్డిగూడెం శ్రీరామ ఆధ్యాత్మిక సేవ సమితి సభ్యులకు అందజేశారు. ముందుగా కోరా కన్నయ్య, కండెపు ప్రసాద్, గారపాటి ఆశ్వంత్ దంపతులు శోభాయాత్ర నిర్వహించి, ప్రత్యేక పూజల అనంతరం జంగారెడ్డిగూడెం తీసుకెళ్లారు. ఏటా జగన్నాథపురం భజన మండలి మహిళలు, రామభక్తులు గోటితో వలిసిన తలంబ్రాలను భద్రాచలం రాముడి సన్నిధికి పంపించడం ఆనవాయితీ. కార్యక్రమంలో సవలం రామకృష్ణ, ఘైనం వెంకట బ్రహ్మయ్య, గన్నిన సుబ్బారావు, పాము శ్రీను, శ్రీపాద సాయి, కటూకూరి శ్రీను, కోయ్యలమూడి నాగార్జున పాల్గొన్నారు.

ముస్లిం దంపతులకు ఆర్థిక సాయం

నల్లజర్ల, ఏప్రిల్ 6: మండలంలోని పోతవరం గ్రామానికి చెందిన షేక్ బాజీ అనారోగ్యంతో బాధపడుతున్నట్టు గుర్తించిన మండల విశ్వ హిందు పరిషత్ సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. శనివారం పోతవరంలోని షేక్ బాజీ కుటుంబాన్ని పరామర్శించి వారి దంపతులకు నిత్యావసర సరుకులు, పండ్లు, నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో కందుల రవిశేఖర్, ఆలపాటి ధనలక్ష్మి, మయలేడి తాతారావు, గుదే సుబ్బారావు, మద్దూరి విష్ణుమూర్తి, నాగశిరోమణి, రామలక్ష్మి, వెంకట లక్ష్మి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఉండ్రాజవరం, ఏప్రిల్ 6: గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈవోపీ ఆర్డీ జేడీవీ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పాలంగిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో ప్రజ లు, బాటసారులకు ఉపయోగపడే విధంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎండీ హసన్‌జాని, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అధ్యయనోత్సవాలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 6: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలకు ముందుగా నిర్వహించే అధ్యయనోత్సవాలు రెండో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. వసంత మండపంలో వేద పండితులు చతుర్వేద, ద్రవిడవేద పారాయణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పల్లకిపై స్వామివారు ఆలయ ప్రదక్షిణ చేశారు. తిరువీధుల్లో స్వామివారు గరుడ వాహనంపై విహరించారు. రాత్రి చంగోలం పారాయణం, నీరాజన మంత్రపుష్పం ఘనంగా నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, మహిళల కోలాట ప్రదర్శన, అన్నమయ్య సంకీర్తనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

వైసీపీ పాలనలో అభివృద్ధి జీరో

- ఫ్లయ్ ఓవర్ ఇచ్చింది మేమే
- భూముల చదునులో రూ.400 కోట్లు కొట్టేశారు
- కూటమి అభ్యర్థులను గెలిపించాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి



బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సిద్ధార్థనాథ్‌సింగ్, పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 6: రాష్ట్రంతో పాటు రాజమహేంద్రవరం ప్రజలు కూడా పరిపాలనలో మార్పు కోరుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో ఐదేళ్లు గడిచినా రాష్ట్రంలో అభివృద్ధి లేదు. ఏ వర్గానికి సంక్షేమం లేదు అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలో బీజేపీ పార్లమెంట్ కార్యాలయాన్ని శనివారం దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులు ప్రారంభించి పూజలు చేశారు. పార్టీ కార్యాలయం వద్ద, ఆ తర్వాత ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో పార్టీ ముఖ్యనాయకులతో జరిగిన సమావేశంలో పురందేశ్వరి మాట్లాడారు. రాజమహేంద్రవరం అభివృద్ధి జీరో అని, మోరంపూడి వద్ద ఫ్లయ్ ఓవర్ ఇచ్చింది కేంద్ర ప్రభుత్వమే తప్ప ఇక్కడి ప్రజాప్రనిధులు కాదనే సంగతి ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఆకాంక్షల మేరకు అభివృద్ధి జరగలేదు అనే భావన రాజమహేంద్రవరం ప్రజల్లో ఉందన్నారు. కేంద్రం భారీగా ఇళ్లు మంజూరు చేసినా ఆశించిన స్థాయిలో ఇళ్ల నిర్మాణం జరగలేదన్నారు. జగనన్న కాలనీలు కోసం తక్కువ ధరకే భూసేకరణ చేసి ప్రభుత్వం నుంచి భారీగా డబ్బులు తీసుకోవడం చేశారన్నారు. భూములు చదును చేస్తున్నామని మూడు నుంచి నాలుగు వందల కోట్లు కొట్టేసి ప్రజలను మోసం చేశారు. దౌర్భాగ్యపు రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపడానికే బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయని, కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. రాజమహేంద్రవరం ఇంతకు ముందున్న నాయకులు అలవి కాని వాగ్దానాలు చేశారని, రాజమండ్రి, కాకినాడ ట్విన్ సిటీలు చేస్తామని, పాశ్చాత్య దేశాలుగా చేస్తామని చెప్పిన వారు కనీసం పర్యాటక రంగాన్ని కూడా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. తాను రాజమహేంద్రవరం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని కూటమి పార్టీల అభ్యర్థులను కలుపుకుంటూ ముందుకు వెళుతూ వారి సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్, పేరెళ్ల చంద్రశేఖర్ జీ, జిల్లా అధ్యక్షుడు దత్తు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి లంక దినకర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి ఇతర నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నిడదవోలు అభివృద్ధికి కృషి : దుర్గేష్



నిడదవోలులో ప్రచారం నిర్వహిస్తున్న కందుల దుర్గేష్

నిడదవోలు, ఏప్రిల్ 5: నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లోను అభివృద్ధి పరుస్తానని అందరిలో ఒకడిగా... మీతో పాటు కలిసి ఉంటానని జనసేన-టీడీపీ-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం నిడదవోలులోని శాంతినగర్‌లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్లాసు గుర్తుపై ఓటేసి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. ఉమ్మడి మెనిఫెస్టో బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో కొమ్మిన వెంకటేశ్వరరావు, బూరుగుపల్లి శ్రీనివాసు, రంగా రమేష్, నీలం రామారావు, కోలదాసు శ్రీనివాస్, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధి లేదు : ముప్పిడి

తాళ్లపూడి, ఏప్రిల్ 6: వేగేశ్వరపురంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఈ ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధి జరుగలేదని కూటమి నియోజవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గ్రామంలో పర్యటించారు. అభివృద్ధి కావా లంటే ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. ప్రతిఒక్కరూ ఓటు వేసి ఉమ్మడి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వేగేశ్వరపురంలో ఎన్నికల ప్రచారంలో ముప్పిడి వెంకటేశ్వరరావు

క్వాంటమ్ కంప్యూటింగ్‌తో అవకాశాలు మెండు

- నన్నయ యూనివర్శిటీ వీసీ ఆచార్య పద్మరాజు



రీసోర్స్‌పర్సన్ జయసింహను సత్కరిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 6: భవిష్యత్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్‌కు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. నన్నయ వర్శిటీలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఫిజిక్స్ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. ఫిజిక్స్ కోర్సుతో బాటు క్వాంటమ్ కంప్యూటింగ్‌ను బోధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రీసోర్స్‌పర్సన్ శ్రీరామ్ జయసింహ మాట్లాడుతూ ప్రస్తుతం ఉపయోగించే గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జీపీఎస్) బదులుగా క్వాంటమ్ పొజిషనింగ్ సిస్టమ్ (క్యూపీఎస్) అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. క్యూపీఎస్ ఆవిష్కరణలో ప్రిన్సిపల్ ఇన్విస్టిగ్వేటర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ వేగంగా ఫలితాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్‌వర్మ, న్యూఢిల్లీ ఎన్‌పీఎల్ విశ్రాంత శాస్త్రవేత్త భగవాన్‌నారాయణ, ప్రిన్సిపాల్స్ పి.విజయనిర్మల, పి.వెంకటేశ్వరరావు, డీన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీసోర్స్‌పర్సన్ జయసింహను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

టీసీఎస్‌లో ఉద్యోగాలకు రాత పరీక్ష

టీసీఎస్‌లో ఉద్యోగానికి సంబంధించిన రాతపరీక్షను నన్నయ వర్శిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. యూనివర్శిటీ ప్లేస్మెంట్ సెల్, వికాస సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షకు విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. దీనిలో ప్రతిభ కనబరచిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగవకాశాలు కల్పిస్తారని ప్లేస్మెంట్ అధికారి బి.జగన్మోహనరెడ్డి, తెలిపారు. కార్యక్రమంలో వికాస సంస్థ మేనేజర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

రాజానగరం, ఏప్రిల్ 6: మండలంలోని కలవచర్ల మాజీ సర్పంచ్ భర్త, వైసీపీ నాయకుడు ఎర్ని సత్తిబాబు శనివారం వైసీపీకి రాజీనామా సర్పంచ్ పిల్లా రాజబాబు సమక్షంలో జనసేనలో చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు ఓశెట్టి సూర్యచంద్రరావు, అండుబోయిన సింహాచలం, అండుబోయిన రమణ, కొండా వెంకటరమణ తదితరులు జనసేనలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజబాబు, పిల్లా సత్తిబాబు, చల్లా నాగన్న, అడ్డాల వెంకటరమణ పాల్గొన్నారు.



సత్తిబాబుకు కండువా వేసి జనసేనలోకి ఆహ్వానిస్తున్న బత్తుల

బత్తులను గెలిపించాలి

కోరుకొండ, ఏప్రిల్ 6: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన-టీడీపీ-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణను గెలిపించాలంటూ మండలంలోని బొల్లేద్దుపాలెం, గాదరాడ గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు బలరామకృష్ణ, ఆయన సతీమణి బత్తుల వెంకటలక్ష్మి, కుమార్తెలు బత్తుల ప్రత్యూష, వందనాంబిక, తోట పవన్‌కుమార్, టీడీపీ నాయకులు మాదబోయిన అప్పారావు, కుప్పాల వెంకటరత్నం, గాదరాడ సర్పంచ్ దూది కాంతారావు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారంలో భవిత కేంద్రం ఆయా

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తున్న అధికార పక్షం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న భవిత కేంద్రం ఆయా రాజేశ్వరి

సీతానగరం, ఏప్రిల్ 6: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తన భర్తను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్న రాజానగరం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జక్కంపూడి రాజా సతీమణి జక్కంపూడి రాజశ్రీతో కలసి సీతానగరం భవిత కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న రాజేశ్వరి అనే మహిళ నేరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సంఘటన పలు విమర్శలకు తావిస్తోంది. తరచూ ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కుతున్న వైసీపీ చర్యల్లో ఇదొక మచ్చుతునక. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేస్తున్నా అధికార పార్టీ నాయకులు మాత్రం తమ దారి తమదే అన్నట్టు ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంగిస్తూనే ఉన్నారు. ఒక వైపు ప్రభుత్వ జీతం తీసుకుంటూ మరోవైపు ఒక రాజకీయ పార్టీ తరుపున నేరుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వోద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటున్నా ఉద్యోగుల్లో మార్పులు రావడం లేదు. ఇటువంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష నాయకులు కోరుతున్నారు.

వేమగిరిలో గద్దర్ జయంతి

కడియం, ఏప్రిల్ 6: వేమగిరిలో ఎన్టీఆర్, ఘంటసాల అభిమాని ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో గద్దర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమలో సాయిరామ్ ఆటోయూనియన్ సభ్యులు, గద్దర్ అభిమానులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిఘా బృందాలు కీలకం

రాజమహేంద్రవరం రూరల్ ఆర్వో తేజ్‌భరత్

పలు బృందాలకు విధులు, బాధ్యతలపై అవగాహన



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించే ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాస్టికల్ సర్వైవల్ బృందాలు నిబద్ధత కలిగి ఉండాలని రాజమహేంద్రవరం రూరల్ ఆర్వో, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆదేశించారు. శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో వివిధ బృందాల(ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ) అధికారులకు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు వేసేందుకు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటికల్ సర్వైవల్, వీడియో సర్వైవల్ బృందాలు తనిఖీ నిర్వహించడంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. బెదిరింపులు, సంఘ విద్రోహుల తరలింపు, మద్యం, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ఓటర్లకు లంచాలు ఇవ్వడానికి పెద్దమొత్తంలో నగదు వంటి సబంధించిన అన్ని ఫిర్యాదులకు ఫ్లైయింగ్ స్క్వాడ్ స్పందించి దాడులు చేయాలన్నారు. అలాగే స్టాస్టికల్ సర్వైవల్ బృందాలు అక్రమ మద్యం, లంచంగా వస్తువులు పంపిణీ, ఆయుధాలు, సంఘవిద్రోహ శక్తుల కదలికలు వంటి వాటిపై నిఘా పెట్టాలన్నారు. వీడియో సర్వైవల్ బృందాలు సున్నిత సంఘటనలు, పెద్ద బహిరంగ సభలు, వీడియోగ్రఫీ సహాయ రిటర్నింగ్ అధికారి ప్రత్యేక పర్యవేక్షణలో స్వయంగా నిర్వర్తించాలన్నారు. సభలో కుర్చీలు, కటౌట్‌లు, పోస్టర్లు, వాహనాలు, అభ్యర్థి ఎన్ని వాహనాలు ప్రచారానికి వినియోగిస్తున్నారు వంటివి వీడియో రికార్డులు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ ఐ.సాయిబాబు, కొండయ్య, ఏఆర్‌వోలు తహశీల్దార్లు వైకేవీ అప్పారావు, బి.రమాదేవి, ఎంపీడీవోలు, ఎంసీసీ, ఎస్ఎస్‌టీవీఎస్‌టీ సెక్టార్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమ్మేటివ్- 2 పరీక్షలు ప్రారంభం

రంగంపేట, ఏప్రిల్ 6: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సమ్మేటివ్-2 (వార్షిక) పరీక్షలు ప్రారంభమయ్యాయని ఎంఈవో కె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ శనివారం తెలుగు సబ్జెక్టుతో ప్రారంభమై ఈ నెల 18వ తేదీతో పూర్తవుతాయన్నారు. టోఫెల్ పరీక్ష ప్రశ్న పత్రాలు కూడా సిద్ధం చేశామన్నారు. వేసవిలో రెండో పూట తరగతులు నిర్వహించకూడదని, వడదెబ్బ తగలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు విద్యార్థులకు తెలియజేసి చైతన్య పరచాలని ఆయన కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తరగతులు, పరీక్షలు నిర్వహించాలని చెప్పారు.

దుప్పలపూడిలో 'న్యాయం కోసం నల్లమిల్లి'



దుప్పలపూడిలో కుటుంబ సభ్యులతో కలిసి పర్యటిస్తున్న నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 6: ప్రజలు, టీడీపీ శ్రేణుల ఆకాంక్షలు నెరవేరే సమయం ఆసన్నమైందని, నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పోటీలో ఉంటుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ సీటును కోల్పోయిన ఆయన చేపట్టిన న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమాన్ని శనివారం మండలంలోని దుప్పలపూడిలో నిర్వహించారు. తన తల్లి సత్యవతి, సతీమణి మహాలక్ష్మి, తనయుడు మనోజ్‌రెడ్డి తనయ డాక్టర్ సనాతనితో కలిసి పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. పలు చోట్ల వృద్ధులు భావోద్వేగానికి లోనవడంతో వారిని నల్లమిల్లి ఓదార్చారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, ఆళ్ల గోవింద, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, జుత్తుగ సూర్యకుమారి, సిరసపల్లి లక్ష్మి, పోతంశెట్టి సుభాషిణి, ఒంటిమి గౌతమి పాల్గొన్నారు.

జి.దొంతమూరులో 'ఆరోగ్య సురక్ష'



వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న డాక్టర్ చిన్నారావు

రంగంపేట, ఏప్రిల్ 6: జి.దొంతమూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం పీహెచ్‌సీ వైద్యులు కె.చిన్నారావు అధ్యక్షతన ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 386 మందికి ఈసీజీ, రక్తపరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో కొందరిని మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఆర్.పార్వతిబాయ్, జి.గౌతమ్, ఇందిర, సీహెచ్‌వో కె.జయమణి, ఎంపీహెచ్‌ఈవో పి.ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ మణికంఠ, గ్రామ కార్యదర్శి శాంతిగూరి, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇంటింటా ప్రచారం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 6: కూటమి అధికారంలోకి వస్తే యువతకు ఉపాధి కల్పించడంతో పాటు బంగారు భవిష్యత్తు చూపిస్తామని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 42వ డివిజన్ మునిసిపల్ కాలనీలో టీడీపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మళ్ళ వెంకట్రాజు, ఆడారి లక్ష్మీనారాయణ, దుద్దేటి నాగేంద్ర యాదవ్, కేవీ శ్రీనివాస్, మోతా పండు, కొండబాబు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

రాజమహేంద్రవరం కమిషనర్ దినేష్‌కుమార్



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ,ఏప్రిల్ 6: రాజమహేంద్రవరంలో జరుగుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ కే.దినేష్‌కుమార్ ఆదేశించారు. నగరంలో సంస్కృత కాలేజీ నుంచి పేపరు మిల్లు వెళ్లే రోడ్డు, టీచర్స్ కాలనీ, మెయిన్ రోడ్డు, రంగ్రీజుపేట రోడ్డు, నాగుల చెరువు డ్రైన్ పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పనులు పూర్తి నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలన్నారు. రోడ్డు మందాన్ని పరిశీలన చేశారు. నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను 14 రోజుల పాటు తప్పనిసరిగా తడపాలన్నారు. శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఈ జి.పాండురంగారావు, ఈఈ శేషగిరిరావు, మదర్‌షా అలీ, డీఈఈ ప్రకాశరావు, చంద్రశేఖరరావు, అసిస్టెంట్ ఇంజనీర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు ఐ.శ్రీనివాస్, సయ్యద్ ఖాసిం పాల్గొన్నారు.

30 బీరు సీసాలు స్వాధీనం

దేవరపల్లి, ఏప్రిల్ 6: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో జరిగిన దాడుల్లో 30 బీరు సీసాలు స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ కేవీ స్వామి తెలిపారు. నల్లజర్ల మండలం కొత్తగూడెంలో 10 బీరు సీసాలతో ఒకరిని, దేవరపల్లి మండలం దుద్దుకూరులో 10 బీరు సీసాలతో ఒకరిని, గోపాలపురం మండలం జగన్నాథపురంలో 10 బీరు సీసాలతో ఒకరిని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. పాత నిందితులు 9మందిని గోపాలపురం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	కింగ్ ఆఫ్ గాడ్జిల్లా
వై.స్క్రీన్2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	ఓం బీం బుష్
అనన్య	డీజే టిల్లు-2
నిడదవోలు	
వీ మ్యాక్స్	ప్రేమలు
రాధాకృష్ణ	భీమా
శ్రీగణపతి	ఓం బీం బుష్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి